


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 05-05-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 228 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## గడువులోగా
# పనులు పూర్తిచేయాలి

ఇది చాలా కీలక సమయం

గృహాల పథకాలను సకాలంలో పూర్తిచేయాలి

సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి: రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల పనులు, ఇతర ప్రాజెక్టులను గడువులోపు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు... అధికారులను ఆదేశించారు. ఇది చాలా కీలక సమయమని, ప్రారంభించిన పనులు పూర్తిచేయకుంటే కొత్త సమస్యలు వస్తాయన్నారు. సీఆర్‌డీఏ ప్రాజెక్టులు, రాజధానిలో స్థలాలు పొందిన యూనివర్సిటీలు, వైద్య ఆరోగ్య సంస్థల నిర్మాణ పురోగతిని గురువారం సచివాలయంలో సమీక్షించారు. హ్యాపీ సిటీస్ సదస్సు నిర్వహణ తర్వాత చేపట్టాల్సిన కార్యక్రమాలు, భూముల కేటాయింపులు, టెండర్ల షెడ్యూళ్లు, ప్రాజెక్టుల పురోగతి, వాటర్ ఫ్రంట్ ఇంజినీరింగ్ తదితర అంశాలపై చర్చించారు. భూములు పొంది ఇంకా నిర్మాణాలు ప్రారంభించని సంస్థల ఉదాసీనత వైఖరిపై తిరిగి సమీక్ష చేయాలన్నారు. విట్, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, ఎల్‌వీ ప్రసాద్, జేవీఎల్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక యూనివర్సిటీలు ఏ మేరకు నిర్మాణాలు పూర్తిచేశాయో, ఏయే దశాల్లో ఉన్నాయో వివరించే వీడియోలను సీఎం పరిశీలించారు. అలక్ష్యం సరికాదని, చాలా ఆలస్యం చేస్తున్నారని ఇండో-యూకే హెల్త్ యూనివర్సిటీని ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస భవనాలు, ఎన్జీవోల గృహాల పథకాలను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. వాటర్ ఫ్రంట్ ఇంజినీరింగ్ పనులను సమీక్షిస్తూ... పర్యావరణానికి హాని కలిగించని రీతిలో నిర్మాణాలు అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. అన్న క్యాంటీన్లు ఆకర్షణీయంగా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అమరావతిలో ఐటీ పార్క్ టవర్ నిర్మాణానికి సంబంధించి షాపూర్‌జీ ఇచ్చిన గ్రూప్ ప్రజెంటేషన్‌ను సీఎం వీక్షించి, కొన్ని సూచనలు చేశారు. నిర్మాణ డిజైన్ తరువాయి 2లో

### 22న విశాఖలో ధర్మపోరాట సభ

అమరావతి : కేంద్రంపై పోరాటంలో భాగంగా తెలుగుదేశం పార్టీ విశాఖపట్నం వేదికగా చేయనున్న ధర్మపోరాట సభను ఈ నెల 22న నిర్వహించనున్నారు. తొలుత 20వ తేదీనే సభను ఏర్పాటు చేయాలని భావించినా... చివరకు 22న నిర్వహించాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో గురువారమిక్కడ భేటీ అయిన పార్టీ నేతలు ఆయా కార్యక్రమాలపై చర్చించారు. ప్రతి జిల్లాలోనూ ధర్మపోరాట సభలతో పాటు... ఎక్కడికక్కడ ప్రజలను తరువాయి 2లో

## దాచేపల్లి ఘటనలో నిందితుడు
# సబ్బయ్య ఆత్మహత్య

చెట్టుకు ఉరివేసుకున్నాడు.. ఎస్పీ పర్యవేక్షణలో నిఘా ఏర్పాటు

బాధితురాలి కుటంబానికి పరిహారం., బాధితురాలికి ప్రభుత్వం అండ

హోంశాఖమంత్రి చినరాజప్ప ప్రకటన



వార్త 2వ పేజీలో.

## ఇది చేతకాని ప్రభుత్వం..



గుంటూరు: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని వైసీపీ ఎమ్మెల్యే రోజా పరామర్శించారు. బాధితురాని కుటుంబాన్ని ఆదుకుని పూర్తి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసిన రోజాను బలవంతంగా కారులో ఎక్కించి అక్కడి నుండి పంపించివేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రోజా చేతకాని దద్దమ్మల పాలన వల్లే ఇలాంటి అకృత్యాలు జరుగుతున్నాయింటూ ప్రభుత్వంపై మండిపడ్డారు.

రోజా మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఆ చిన్నారి చూస్తుంటే మనసు తరుక్కుపోతుంది. ఆ చిన్నారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. తరువాయి 2లో

ప్రచారం నిర్వహిస్తూ ఎమ్మెల్యే
### హఠాన్మరణం
వార్త 2లో

దర్శకుడి స్థాయిని పెంచిన దాసరి

సినీ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్
వార్త 2లో

రాష్ట్ర సంపదను దోచుకుంటున్న తండ్రీకొడుకులు

విశాఖ సంఘీభావ యాత్రలో

వైకాపా నేత విజయసాయిరెడ్డి ధ్వజం
వార్త 8లో



# దర్శకుడి స్థాయిని పెంచిన దాసరి



హైదరాబాద్: దర్శకరత్న, నిర్మాత, నటుడు డాక్టర్ దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మే 4ను 'డైరెక్టర్స్ డే'గా నిర్ణయించడం సంతోషకరమని సినీనటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. దర్శకుడి పేరుకి ఓ బ్రాండ్ తీసుకొచ్చి.. దర్శకుడి స్థాయిని సగర్వంగా పెంచిన వ్యక్తి దాసరి అని కొనియాడారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. దాసరి మొదటి సినిమా తాతామనవడు నుంచి వారి సినిమాల్లో కుటుంబ విలువలు, సామాజిక స్పృహ కనిపించేవని, దాసరితో తనకు మంచి అనుబంధం ఉండేదని ఆయన గుర్తు చేసుకున్నారు.

తెలుగు సినీ కుటుంబానికి పెద్దగా దాసరి స్థానం సుస్థిరమని పవన్ అభిప్రాయపడ్డారు. తెలుగు సినిమాకు దాసరి లాంటి కుటుంబ పెద్దల అవసరం ఎంతైనా ఉందన్నారు. దాసరి బాటను అనుసరించినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అర్పించినట్లని పవన్ పేర్కొన్నారు. రంగస్థలం నుంచి సినిమాలకి వచ్చిన దాసరి.. ఓ నటుడిగా, నిర్మాతగా, రచయితగా సినీ రంగానికి సేవలందించారని చెప్పారు. కాగా, దాసరి 71వ జయంతి. శుక్రవారం ఉదయం దాసరి ఇంట్లో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఫిల్మ్ నగర్ సొసైటీ కాంప్లెక్స్‌లో సాయంత్రం దాసరి నారాయణరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరగనుంది. దాసరి జయంతిని పురస్కరించుకుని తెలుగు చిత్ర పరిశ్రమ ఆయనకు అరుదైన గౌరవాన్ని అందిస్తూ.. మే 4ను డైరెక్టర్స్ డే ప్రకటించిన విషయం తెలిసిందే. టాలీవుడ్‌కు చెందిన పలువురు దాసరి సేవల్ని కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు.

# దాచేపల్లి ఘటనలో నిందితుడు సుబ్బయ్య ఆత్మహత్య

దాచేపల్లి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రకంపనలు సృష్టించిన గుంటూరు జిల్లా దాచేపల్లి ఘటనలో నిందితుడైన వృద్ధుడు సుబ్బయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. దైదా దగ్గర అమరలింగేశ్వర దేవాలయం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు హోంశాఖమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రకటించారు. ఇలాంటి ఘటనల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మరోవైపు, సుబ్బయ్య ఉరివేసుకున్నది ఎప్పుడనేది వైద్యులు నిర్ధారిస్తారని డీజీపీ తెలిపారు.

**బాధితురాలి కుటుంబానికి పరిహారం**

దాచేపల్లిలో బాలికపై పుల్లయ్య అనే వృద్ధుడు అత్యాచారం చేసిన ఘటనలో బాధితురాలి కుటుంబానికి ఏపీ ప్రభుత్వం రూ. 5లక్షల పరిహారం ప్రకటించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అత్యాచార బాధితురాలిని హోంమంత్రి చినరాజప్ప శుక్రవారం పరామర్శించారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ భరోసా ఇచ్చారు. మరోవైపు దాచేపల్లిలో నిన్నటి ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా్లా చేశారు.

**మొదటి పేజీ తరువాయి**

## గడువులోగా పనులు పూర్తి చేయాలి

నవ్యతను ప్రతిబింబించాలని, అయితే రాజధాని నగర నిర్మాణాల డిజైన్లతో వైరుధ్యం ఉండకూడదని స్పష్టంచేశారు. అనంతరం ఎస్ఆర్ఎం ఇండస్ట్రియల్ రిసెర్చ్ పార్కుపై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రతినిధి బృందం ప్రజెంటేషన్ ఇచ్చింది. అమృత యూనివర్సిటీ ప్రతినిధులు వారి క్యాంపస్ నిర్మాణాల పురోగతిని సీఎంకు వివరించారు. ఈ సమీక్షలో పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, సీఎంవో అధికారులు సతీశ్‌చంద్ర, సాయిప్రసాద్, గిరిజాశంకర్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, సీసీఎండీసీ ఎండీ లక్ష్మీ పార్థసారథి, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు.

**తెలంగాణ నేతలతో చంద్రబాబు భేటీ**

తెలుగుదేశంను తెలంగాణలో సంపూర్ణంగా బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం, ప్రోత్సాహం అందిస్తానని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జరిగిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమైన చంద్రబాబు మహానాడు నిర్వహణ, రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. భవిష్యత్ ప్రణాళికలపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 24న హైదరాబాద్ ఎగ్జిబిషన్ మైదానంలో మహానాడు నిర్వహించ బోతున్నామని, 27 నుంచి 29 వరకు జాతీయ స్థాయి మహానాడు విజయవాడలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని చంద్రబాబు సూచించారని రావుల తెలిపారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌పై ఎలాంటి చర్చ జరగలేదన్నారు.

## 22న విశాఖలో ధర్మపోరాట సభ

చైతన్యం చేసేందుకు సైకిల్ యాత్రలు చేపట్టాలని చంద్రబాబు నిర్దేశించారు. రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయాన్ని, బీజేపీ-వైసీపీ-విపక్షాలు చేస్తున్న కుట్ర రాజకీయాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. నెల్లూరులో దళిత తేజం బహిరంగ సభను జూన్ మొదటివారంలో నిర్వహించాలని నిర్ణయించారు.


## ఇది చేతకాని ప్రభుత్వం

కూలి చేస్తేనే కాని కడుపు నిండని పరిస్థితి. అలాంటి తల్లిదండ్రులు ఆడపిల్లలు కనడమే పాపమా అన్నట్టు ప్రస్తుత పరిస్థితి తయారైంది. ఆ చిన్నారి మగవాళ్లను ఎవరైనా చూస్తుంటే భయపడిపోతుంది. బలమైన గాయాలతో ఆ చిన్నారి ఎంతో వేదన అనుభవిస్తుంది. ఇటీవల కాలంలో గుంటూరు జిల్లాలో చాలా అకృత్యాలు జరిగాయి. ముఖ్యమంత్రి నివాసం ఉంటున్న గుంటూరులోనే 7 అత్యాచారాలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా గత 40 రోజుల్లో 45 అత్యాచారాల కేసులు నమోదయ్యాయంటే.. ఇంతకంటే చేతకాని దద్దమ్మ ముఖ్యమంత్రి ఎవరైనా ఉంటారా? ముఖ్యమంత్రి అసమర్థ పాలన వల్లే ఇలాంటి అకృత్యాలు జరుగుతున్నాయి. ఈ దారుణ సంఘటనలు జరుగుతుంటుంటే ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు.

మాట్లాడితే అనుభవం.. అనుభవం అంటాడే.. 40 ఏళ్ల నీ రాజకీయ అనుభవం ఇదేనా? అద్భుతమైన టెక్నాలజీ నా దగ్గర ఉంది అంటారు మరి ఇంతమంది ఆడపిల్లల మాన ప్రాణాలు పోతుంటే వాటిని అడ్డుకునే టెక్నాలజీ నీ దగ్గర లేదా చంద్రబాబూ అని అడుగుతున్నా.. ఎక్కడో అసిఫాకి అన్యాయం జరిగిందని ఉపన్యాసాలు ఇచ్చిన నువ్వు.. ఈరోజు నువ్ పరిపాలిస్తున్న రాష్ట్రంలో నువ్ నివసిస్తున్న గుంటూరులో ఓ చిన్నారిపై అత్యాచారం జరిగితే ఎందుకు కాపాడలేకపోయావు. కనీసం వచ్చి ఆ కుటుంబానికి ఓ భరోసా ఇవ్వగలిగావా? అత్యాచారం జరిగిన చిన్నారిని పలకరించావా? పేదవాడి ఆడపిల్ల మానప్రాణానికి విలువ లేదనుకుంటున్నావా? వాళ్లను ఓదారిస్తే.. నాకేం లాభం అనుకుంటున్నావా?

ఈ ముఖ్యమంత్రి పరిపాలన వల్లే.. నేరాలు పెరిగిపోతున్నాయి. నేరస్థులకు కొమ్ముకాయడం వల్లే ఇలాంటి దారుణాలు ఎక్కవవుతున్నాయి. ఆరోజు రిషితేశ్వరి కేసులో ఫస్ట్ ట్రాక్ పెట్టి నిందితుల్ని కఠినంగా శిక్షించినట్లయితే ఇలాంటి దారుణాలు జరిగేవి కావు. వనజాక్షి అనే ఎమ్మార్వో విషయంలో మీరు మీ ఎమ్మెల్యే చింతమనేనిని ఎలా కాపాడారో తెలిసిందే. పైగా అతనికి ప్రమోషన్ ఇస్తూ ప్రభుత్వ విప్ పదవి ఇచ్చారు. వీటిని బట్టి మీరు నిందితుల్ని ఎలా కాపాడుతున్నారో ప్రజలకు అర్థం అవుతూనే ఉంది. ఓ చిన్నారిపై అత్యాచారం జరిగి 48 గంటలు దాటినా నిందితుడిని అరెస్ట్ చేయలేదంటే ప్రభుత్వం చేతకాని తనం ఏంటో అర్థమౌతుందంటూ నిప్పులు చెరిగారు రోజా.

# ప్రచారం నిర్వహిస్తూ ఎమ్మెల్యే హఠాన్మరణం



జయనగర్: కర్ణాటకలోని జయనగర్‌కు చెందిన భాజపా ఎమ్మెల్యే బీఎన్. విజయ్ కుమార్ (60) గుండెపోటుతో మృతిచెందారు. ఈ నెల 12న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆయన ప్రచారంలో ఉండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. దీంతో విజయ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందారు. జయనగర్‌లోని పట్టాభిరామానగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తుండగా ఈఘటన చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలో తనదైన ముద్రవేసుకున్న విజయ్‌కుమార్ జయనగర్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి కూడా ఆయన ఇక్కడి నుంచే పోటీచేస్తున్నారు. విజయ్ కుమార్ మృతితో ఆయన సొంత నియోజకవర్గంలో ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉంది. ఈనెల 12న కర్ణాటకలోని 224 అసెంబ్లీ స్థానాలకుగానూ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ఈనెల 15న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# డిసెంబర్ నాటికి దుర్గగుడి ఫ్లైఓవర్ పూర్తి

## కలెక్టర్ లక్ష్మీకాంతం వెల్లడి

కృష్ణా: డిసెంబర్ నాటికి దుర్గగుడి ఫ్లైఓవర్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ లక్ష్మీకాంతం తెలిపారు. అక్టోబర్ నాటికి బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తి చేస్తామని అలాగే నెల రోజుల్లో బందరు పోర్టు పనులు ప్రారంభంకానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వర్షాలకు తడిచిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించామన్నారు. , మైనింగ్‌లో ప్రైవేటు వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాలో ఉద్యోగులకు బయోమెట్రిక్ 100 శాతం అమలు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీకాంతం తెలిపారు.

# చంద్రబాబు మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది



గాజువాక: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీ ప్రజలకు తీవ్రఅన్యాయం చేయడమే కాకుండా రాష్ట్ర సంపదను దోచుకుంటున్నాడని గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పలనాగిరెడ్డి విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతిపక్షపార్టీ వైకాపా ప్రజసమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందని, దీనిని చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని విమర్శించారు. నిన్నిటి వరకు భాజపాతో జతకట్టి అన్ని సమకూర్చుకొని ఇప్పుడు శ్రీరంగనీతులు చెబుతుండడం పట్ల దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. గాజువాకలో తేదేపా మరీ దారుణంగా ఉందని ఎక్కడబడితే అక్కడ భూకబ్జాలు, దౌర్జన్యాలు అడిగే నాదుడు లేరని తెదేపా శ్రేణులు రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. తెదేపా ఆటలను సాగనివ్వమని, ప్రజల వెనుక వైకాపా ఉందని ఎటువంటి అన్యాయాన్నైన ఎదిరించి ప్రజలకు అండగా నిలబడతామని అన్నారు. వైకాపాను విమర్శించడం మానాలని తెదేపాకు సూచించారు. జగన్ ప్రజాసంకల్పయాత్రకు సంఘీభావంగా రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తలపెట్టిన పాదయాత్రలో వార్డుల్లోని ప్రజలను పాల్గొననివ్వకుండా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డైరెక్షన్‌లో వార్డు మాజీ కార్పొరేటర్లు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని, పాల్గొంటే ప్రభుత్వ పథకాలు వర్తించవని బెదరింపులకు పాల్పడడం దారుణమని అన్నారు. ఎవ్వరు ఎన్ని జిమ్మిక్కులు చేసిన అంతిమ విజయం వైకాపాదే నని తెదేపా శ్రేణులు గుర్తిపెట్టుకోవాలని చురకలు పెట్టారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఉరుకూటి అప్పారావు, కేబుల్‌మూర్తి, మర్డపూడి పరదేశి, ధర్మాలశ్రీను, మదీనావలిభాషా, పల్లాచినతల్లి, మునీషా బేగం, రెడ్డిజగన్నాథం, కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.

# ప్రజలు, జట్టు కూలీల ఫిర్యాదు మేరకే ఎమ్మెల్యే ఇసుక ర్యాంపు సందర్శన



ఆలమూరు : జొన్నాడ ఇసుక ర్యాంపు సమస్యలపై మండల ప్రజలు, జట్టుకూలీల కోరిక మేరకే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ర్యాంపును సందర్శించడం జరిగిందని మండల వైయస్సార్ సిపి ప్రతినిధులు అన్నారు. ఆలమూరులో రాష్ట్ర వైయస్సార్‌సిపి నాయకులు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో వైయస్సార్ సిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన మండల పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జొన్నాడ ర్యాంపులో ఇసుకను అధికారులు రెండు రకాలుగా విభజించి, తక్కువ క్వాలిటీ ఇసుకను స్థానిక ప్రజలకు ఎక్కువ క్వాలిటీ వున్న ఇసుకను వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం తగదని, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారని ఉచిత ఇసుక అని చెప్పి బాటలు ఖర్చుపై అధికంగా ర్యాంపు నుండి వసూలు చేసి రూ. 2 కోట్లను ప్రభుత్వ ఖాతాకు జమచేయడం జరిగిందని, ఆ సొమ్ము బాట అభివృద్ధి, కూలీల కనీస వసతులకు ఖర్చు చేయాలని ర్యాంపులో ఇసుక త్రవ్వకాలు పారదర్శికంగా వుండాలని త్రిసభ్య కమిటీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. దీనిపై టిడిపి నాయకులు ఎమ్మెల్యేకు అవగాహన లేదనడం హాస్యాస్పదం అని అధికార పార్టీ నాయకులకు వైజాగ్ స్టీల్ ప్లాంటు వారికి ఏవిధమైన రహస్యమున్నదో దానిపై ఎమ్మెల్యేక అవగాహన లేకపోవచ్చని ఎద్దేవా చేసారు. ఇప్పటికైనా ఇసుక త్రవ్వకాలలో జరుగుతున్న అక్రమాలకు అరికట్టడానికి సిసి కెమెరాలు, మినిట్స్‌బుక్ ఏర్పాటు చేయాలని, ఇసుక త్రవ్వకాలలో అక్రమాలను వైయస్సార్‌సిపి చూస్తూ ఊరుకోదని, దానిపై ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. నిజాయితీగా ర్యాంపులో పనిచేస్తున్న ఎ.ఎస్.ఐ. నాగరాజుపై శుక్రవారం టిడిపి నాయకులు దౌర్జన్యాన్ని ఖండిస్తూ అటువంటి వారి పక్షాన వైయస్సార్‌సిపి పోరాటం చేస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నామాల శ్రీనివాసు, నైనాల శ్రీరామచంద్రమూర్తి తోరాటి లక్ష్మణరావు, నాంద్ర నాగమోహనరెడ్డి, నల్లి రాజు, పామర్తి శ్రీనివాసు, ఆనెం వెంకన్న, చల్లా నానాజీ, డిపి రావు, మోటిపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రియల్టర్లు నిర్మిస్తున్న వంతెన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

## లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణ-సిపిఎం హెచ్చరిక



కాకినాడ : కాకినాడ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో మేడలౌను పొలాలకు ఉప్పుటేరుపై అక్రమంగా నిర్మిస్తున్న వంతెన నిర్ణాంపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది.శుక్రవారం ఉదయం సిపిఎం జిల్లా నాయకుటు దువ్వాశేషుబాబ్జి ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న వంతెన పరిసరాలలో పర్యాటించారు.అక్కడ పని చేస్తున్నవారిని వివరాలు అడుగగా హైదరాబాదుకు చెందిన గ్రీన్ కో.అనే కంపెనీ ఈనిర్మాణం చేస్తుందని తామంతా కూలీలమని ,తామంతా వేరే జిల్లా వాసులమని సిపిఎం బృందానికి తెలిపారన్నారు. దీనిపై శేషుబాబ్జి మాట్లాడుతూ బకింగ్ హామ్ కెనాల్ గా పిలువబడుతున్న ఈ జలమార్గం దేశంలో గల జాతీయ జల రవాణా నెంబర్ 4గా ఉందన్నారు.గతంలో కొంమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వంతెన నిర్మాణాన్ని ప్రారంభిస్తే నాటి కలెక్టర్ నిలుపుదల చేసారనిగుర్తు చేసారు. ఈకాలువపై ఎటువంటి నిర్మాణం జరగాలన్నా కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరని ఆనాడే పేర్కొన్నారన్నారు.నేడు రెవిన్యూ, ఇరిగేషన్, పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సమంజసంగా లేదన్నారు. ఈ నిర్మాణంపై ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల వీరబాబు, ఎంవి రమణ, తిరుమల శెట్టి నాగేశ్వరరావు, సిహెచ్ రాజ్కుఉమార్, సుబ్బరాజు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



కాకినాడ : రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ .అంబేద్కర్ జయంతి వేడుకలు ఈనెల6న స్థానిక అంబేద్కర్ భవన్‌లో తూర్పుగోదావరి జిల్లా దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఐక్యవేదిక కమిటి తెలిపింది. ఈజయంతి వేడుకలకు ముఖ్యఅతిధిగా పివి.సునీల్ కుమార్ అడిషనల్ డిజిపి(సిఐడి) విచ్చేసి ప్రసంగిస్తారన్నారు.దక్షిణ భారత దేశ దళిత ప్రచార ప్రతినిధి పొనుగుమల్లు విష్ణుమూర్తి ,సామాజిక వేత్త స్కాలర్,గోగుల మందర పాల్గొని ప్రసంగిస్తారన్నారు. జయంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. కావున జిల్లాలోని అంబేద్కర్ అభిమానులు, విద్యార్థులు, డాక్టర్లు, న్యాయవాదులు యువజనులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కార్యనిర్వాహక సభ్యుడు బయ్యా రాజేంద్ర కుమార్ కోరారు.ఈ సమావేశంలోఆహ్వాన కమిటి సభ్యులు డి.నూకరాజు ,తాడి బాబ్జి,కె.ఉదయ్‌కుమార్,ఎం.కృష్ణ మూర్తి,బచ్చుల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# మహిళ దహనం

## మృతదేహం చూస్తే పసు అనుమానాలు

## సంఘనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూంస్ టీం

విశాఖ క్రైంః విశాఖ శివారు ప్రాంతమైన నరవలో దారుణం చోటు చేసుకుంది. గుర్తు తెలియని వివాహిత వయస్సు సుమారు 27 మహిళని తగలపెట్టి చంపిన ఘటన కొత్తపాలెం ,ఈ మహిళను బయట హత్యచేసి నరవ వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రదేశం లో మహిలను తగులపెట్టారు. ఈ దారుణం సుమారు తెల్లవారి జరిగిందని అదే రోడ్డు లో వాకింగ్ కు వెళినవాళ్లు అప్పటికి తగలబడుతున్న మృతదేహం ను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు .ఘటనా స్థలానికి చేరుకున్న పెందుర్తి, మరియు గోపాలపట్నం పోలీసులు .వివరాలు ఇంకా తెలియవలసి వుంది.

# ఎల్ఆర్ఎస్ గౌరవ సలహాదారునిగా ఆచార్య శర్మ



ఆంధ్రవిశ్వవిద్యాలయంః లింగ్విస్టిక్స్ రీసెర్చ్ సొసైటీ గౌరవ సలహాదారునిగా ఏయూ లింగ్విస్టిక్స్ విభాగ విశ్రాంత ఆచార్యులు సి.ఆర్.ఎస్ శర్మ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ సభ్యులు ఆచార్య శర్మను సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య శర్మ మాట్లాడుతూ భాషను, భాష స్వరూపాన్ని నేర్చుకోవడంలో లింగ్విస్టిక్స్ ఎంతో ప్రధాన మూమిక పోషిస్తాయన్నారు.

ఎల్ఆర్ఎస్ సంస్థ గౌరవ అద్యక్షులు ఆచార్య యు.ఎన్ మూర్తి మాట్లాడుతూ భాష శాస్త్ర వికాసానికి లింగ్విస్టిక్స్ రీసెర్చ్ సొసైటీ ఎంతో కృషిచేస్తోందన్నారు. ఇప్పటి వరకు అనేక పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించిందన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ కె.శాంతి, చల్లా క్రిష్ణవీర్ అభిషేక్, శౌరి రెడ్డి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ యూనివర్సిటీకి స్పందన

## సమాధానాలిచ్చిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్రవిశ్వవిద్యాలయం : వీయూలో ప్రతీ నెల మొదటి శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలకు స్వయంగా సమాధానమిచ్చారు. ఏయూ వీసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన డయల్ యువర్ యూనివర్సిటీలో విద్యార్థుల సందేహాలకు అధికారులు స్వయంగా సమాధానమిచ్చారు. ఇంజనీరింగ్ ప్రవేశాలు, ఆసెట్, దూరవిద్య, పరీక్షల విభాగాలకు సంబంధించిన పలు ప్రశ్నలకు ఫోన్‌లో అధికారులు సమాధానాలు ఇచ్చారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.గాయిత్రి దేవి, రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వర రావు, ప్రవేశాల సంచాలకులు ఆచార్య ఏ.రాజేంద్ర ప్రసాద్, దూరవిద్య సంచాలకులు ఆచార్య బి.మోహిని, డీన్‌లు పి.హరి ప్రకాష్, కె.చంద్రమౌళి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.వి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక ద్రోహిగా మారిన

# బిజెపి, తెలుగుదేశం ప్రభుత్వాలు

## సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్




విశాఖపట్నంః కేంద్ర బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వాలు కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను పూర్తిగా ఉల్లంఘించి కార్మిక ద్రోహి ప్రభుత్వాలుగా మారాయని సిఐటియు నగర అధ్యక్షుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్ విమర్శించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం సెంటర్‌లో తోపుడుబండ్లు కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మిక హక్కులకోసం కార్మికులకు కనీస వేతనాలు, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని అనేక హక్కులను సాధించుకున్నారని గుర్తుచేసారు.

సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేసి చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలని తీర్పునిచ్చిందన్నారు. చంద్రబాబునాయుడు, మంత్రులు, విఐపిలు, పెట్టుబడుదారులు విశాఖనగరం వచ్చిన ప్రతీ సారి తోపుడుబళ్లు పెట్టరాదని హకుం జారీచేస్తున్నారన్నారు. దీనివలన వ్యాపారం చేసుకోలేని పరిస్థితి. కార్మికుల ఉపాధిని దెబ్బతీసేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు.

సిపిఎం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు మాట్లాడుతూ మోడీ, చంద్రబాబులు ఇంటికో ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ భృతి 2వేలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడదీశారన్నారు. అనేకమంది తోపుడుబండ్లు కార్మికులకు సొంతిల్లు లేక నగరానికి దూరంగా అద్దెకొంపల్లో ఉంటూ నగరంలోకి జీవనోపాధికై వస్తున్నారన్నారు. వీరిందరికీ స్కీము ఇళ్లు ఇచ్చినట్లు అయితే వీరికి వచ్చే ఆదాయం కుటుంబం గడవటానికి సరిపోయి ఉండేదని అప్పులు చేయాల్సిన పని లేకుండా ఉండేదన్నారు.

తోపుడు బండ్ల సంఘం నగర గౌరవాధ్యక్షుడు ఎ.అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీతో మేడే సంబరాలు ముగుస్తాయని, 6న ఆర్కేబీచ్‌లో సాంస్కృతిక ఉత్సవాలు ఉంటాయని, కుటుంబాలతో హాజరు కావాలన్నారు.

సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు ఎ.సింహాచలం అధ్యక్షతన జరిగిన ఈ సభలో తోపుడుబళ్లు సంఘం నాయకులు శ్రీను, నాయుడు, వెంకటలక్ష్మి, వెంకట్రావు, లక్ష్మణరావు, రవి, చంటి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులదరికీ నష్టపరిహారం చెల్లించాలి

విశాఖ సిటీః నిర్వాసితుల విషయంలో హైకోర్టు మధ్యంతర ఆదేశాల ప్రకారం 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ఆర్ & ఆర్ ప్యాకేజిని తక్షణమే అమలు చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నది.

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఎక్కడిపడితే అక్కడ విచ్చలవిడిగా అవసరానికి మించి భూ సేకరణ చేపట్టింది. భూమి కోల్పోతున్న నిర్వాసితులకు చట్ట ప్రకారం కల్పించాల్సిన పునరావాస ప్యాకేజి అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసింది. 448 భూ సేకరణ నోటిఫికేషన్లు వల్ల నష్టపోయే రైతులు, కూలీలుగానీ, చేతివృత్తుల వారుగాని ఒక్క కుటుంబమూ లేదని ఎపీ ప్రభుత్వం హై కోర్టుకు చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమే. విశాఖ జిల్లా సబ్బవరం, అనకాపల్లి, నక్కపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వం సేకరించిన భూములపై ఆధారపడిన వేలాది మంది కూలీలు, చేతివృత్తిదారులు ఆధారపడి జీవిస్తున్నారు. వారికి నష్టపరిహారం ఇవ్వాలని సిపిఎం అనేక మార్లు ఆందోళన చేసిన విషయం విధితమే. కాని చంద్రబాబు ప్రభుత్వం భూసేకరణ వల్ల రైతులు, కూలీలు, చేతివృతులు వారు ఎవరూ లేరని చెప్పడం సిగ్గుచేటు. సాక్షాత్తూ హైకోర్టు ప్రభుత్వ వివరణ సత్యదూరంగా వుందని ప్రకటించడం ప్రభుత్వానికి చెంపపెట్టు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి. జిల్లాలో అన్ని భూసేకరణ ప్రాంతాల్లో 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఆర్&ఆర్ ప్యాకేజి అమలు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తోంది.

# ప్రారంభమైన సమ్మర్ క్రికెట్ క్యాంపు



భీమునిపట్నంః విడిసిఎ, ఎబిసిల ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ క్యాంపు స్థానిక వుడా మినీ స్టేడియంలో ప్రారంభమయింది. 12, 14, 16 విభాగాల్లో ఒకొక్క విభాగంలో 20 మంది చొప్పున మూడు విభాగాలలో 60 మందికి ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. వీరికి వి.డి.సి.లో కోచ్‌లు నరసింగరావు, కుమారస్వామిలు శిక్షణ ఇస్తారు. రోజూ ఉదయం 6గంటల నుండి 8గంటల వరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు కుమారస్వామి తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మొకర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్లికానుక పంపిణీ



భీమునిపట్నంః భీమిలి జోన్ పరిధిలో ఉన్న బ్యాంకు కాలని 14వ వార్డులో చింతగుంట ఝాన్సీ, గోలి అప్పల గోవింద్‌లకు, 20వ వార్డుకు చెందిన రీసు స్వాతి, బాడిదబోయిన లక్ష్మీ అప్పలప్రసాద్‌లకు, 25వ వార్డు నమ్మివానిపేటకు చెందిన గొలగాని కళ్యాణి, కోరాడ రామకృష్ణలకు ఒకొక్కరికి చంద్రన్న పెళ్ళి కానుక క్రింద రూ.35 వేల రూపాయల బాండ్‌లను భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గంటా నూకరాజు అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ చంద్రన్న పెళ్ళి కానుక పేదలకు వరం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంటపిల్లి యోగి, మారోజు సంజీవ్, గిడుతూరి శ్రీను, గండిబోయిన పోలిరాజు, ఎ.గురునాథ్, తెడ్డు.అప్పలరాజు, మిత్రా చింతపల్లి ఎల్మమాజి, తదితరులు పాల్గొన్నారు.

## బాలలపై జరుగుతున్న లైంగిక దాడులను ప్రతిఘటించాలి

## సీఆర్‌పీఎఫ్ డిమాండ్

విశాఖపట్నంః గుంటూరు జిల్లా దాచేపల్లిలో తొమ్మిదేళ్ల చిన్నారిపై అత్యాచారం జరిగిన సంగతి విదితమే. అత్యాచారం జరిగిన వ్యక్తిని అందరూ చూస్తుండగానే మరణ శిక్షను విధించాలని చైల్డ్ రైట్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం, న్యాయ సలహాదారుడు ఎ. రాజ్ కుమార్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి. శకుంతల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వీరు మాట్లాడుతూ నిర్భయ, కథువ సంఘటనలు యావత్ ప్రపంచాన్ని కదిపివేసిన సంఘటలు అందరికీ తెలిసివేనన్నారు. పోక్సో చట్టానికి తుది మెరుగులు దిద్ది అడబిడ్డలక అభయాన్నివ్వాలని వారు కోరారు. ప్రభుత్వ శాఖల సమన్వంతో దీనిని కఠినగాఅమలు చేయాలని కోరారు. ఈ విషయాలూ ప్రతివారికీ తెలిసేలా చట్టాలు, సమావేశాలు ద్వారా తెలియజేయాలని కోరారు. కళలు, కళాజాతాలు నిర్వహించి జనాన్ని జాగృత పర్చాలని కోరారు. రాజకీయాలకతీతంగా చట్టాలు,కోర్టులు వ్యవహరించాలన్నారు.

## బృందావన కాలనీలో వరసిద్ధి వినాయకుని కోవెలకు శంకుస్థాపన



విశాఖపట్నం : బృందావన కాలనీ వాసులందరూ ఆధ్యాత్మికతతో మెలగాలని, ఇక్కడి ప్రజలందరూ ఆ వరసిద్ధి వినాయకుని కరుణా కటాక్షములు ఎల్లప్పుడూ ఉండాలని, అలాగే కాలనీ వాసులంతా మంచి పనులు ఎప్పుడు చేస్తూ ఉండాలని, మీ అందరికీ నా సహాయ సహకారములు ఎన్నటికీ ఉంటాయని వైకాపా తూర్పు నియోకవర్గ సమన్వయకర్త వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉదయం 1వ వార్డులోగల బృందావన కాలనీలో వరసిద్ధి వినాకుని ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటియువతలో సామూహిక శక్తి ఉందని, దీనిద్వారా ఎంతటి కార్యక్రమానైనా సాధించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యాల సాగరిక, వెంకట్, జీ. ఇమ్మాన్యుయేల్, అప్పన్న, సురేష్, మాణిక్యం, ఎం. శ్రీను, రాజు, ఆర్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గీతం బికామ్ విద్యార్థినికి ఆలిండియా టాప్ ర్యాంకు

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా బికామ్ (ఆనర్స్) తో పాటు ఎసిసిఎ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థిని పూజా శ్రీ వాత్సవ్ బిజినెస్ అనలిటిక్స్‌లో దేశంలో ప్రధమ ర్యాంకును కైవశం చేసుకున్నారని ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.షీలా తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఛార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఎసిసిఎ) ప్రపంచవ్యాప్తంగా 118 దేశాలలో తమ కోర్సును నిర్వహిస్తోందని ,గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా బికామ్ (ఆనర్స్) కోర్సును అభ్యసించేవారికి అంతర్గత శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కాగా విద్యర్థిని ప్రతిభను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎమ్.ఎస్.ప్రసాద రావు,ప్రొ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు అభినందించారు.

# 16 నుంచి గీతం లో ఇంజనీరింగ్ కౌన్సిలింగ్

సాగర్‌నగర్ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఫార్మశీ, ఎమ్.ఆర్క్ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించిన 2018 విద్యా సంవత్సరం అడ్మిషన్ కౌన్సిలింగ్ బుధవారం ప్రారంభం కానుంది. ఈ ఏడాది గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు దేశ వ్యాప్తంగా 80 వేల మంది విద్యార్థులు హాజరవడంతో కౌన్సిలింగ్‌కు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలి వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా కౌన్సిలింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఏక కాలంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు లలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సిలింగ్ జరిగే విధానాన్ని విద్యార్థులు తెలుసుకునేందుకు భారీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు సాధించి గీతం ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు. మొదటి రోజు ఉదయం పిహెచ్ (అంగవైకల్యం ఉన్నవారు), రిజర్వ్‌డ్ కేటగిరి అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సిలింగ్ జరిగే సమయంలో ఏ ఇంజనీరింగ్ కోర్సులో చేరితే ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది అనే అంశంపై సీనియర్ ప్రొఫెసర్‌లతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తున్నారు.

విద్యారుణాల కోసం సమాచారం అందించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్ శాఖలను ఏర్పాటు చేయనున్నాయి. అడ్మిషన్ల నిమిత్తం విద్యార్థులు, తల్లిదండ్రులు దూర ప్రాంతాల నుంచి వస్తున్న దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్కువ సమయంలో అడ్మిషన్ పూర్తి అయ్యేలా శ్రద్ధ వహిస్తున్నట్లు అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంద్ర తెలిపారు.

మొదటి 10 ర్యాంకర్లకు వారి ప్రతిభకు గుర్తింపుగా గీతం ఇంజనీరింగ్ ప్రవేశాలలో పూర్తి ఫీజు రాయితీ, తరువాతి 90 ర్యాంకర్లకు 50 శాతం ఫీజు రాయితీ ఇస్తామని అన్నారు.

బిటెక్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏడాదికి 90 వేల రూపాయలు స్కాలర్‌షిప్ లభిస్తుందని ప్రకటించారు.

బి.ఫార్మశీ లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏడాదికి 80 వేల రూపాయల స్కాలర్‌షిప్, ఎమ్.ఫార్మశీ లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏడాదికి రెండు లక్షల 50 వేల రూపాయల స్కాలర్‌షిప్, అలాగే ఎమ్.టెక్ కోర్సులలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఏడాదికి 80 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. గేట్ లో అర్హత సాధించిన విద్యార్థులు, ఎమ్.టెక్ లో నేరుగా ప్రవేశం పొందవచ్చునన్నారు.

ప్రవేశ పరీక్ష రాసిన వారిలో 30 వేల మందికి మొదటి దశ కౌన్సెలింగ్‌కు అనుమతిస్తున్నామని, మే 16 వ తేది నుంచి 19వ తేది వరకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ గీతం ప్రాంగణం, హైదరాబాద్ సిటీ మరియు బెంగళూరు సిటీ, బెంగళూరు గీతం ప్రాంగణంలలో ఏర్పాటయ్యే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రాలలో అడ్మిషన్లు నిర్వహిస్తామని అడ్మిషన్ల డైరక్టర్ ప్రొఫెసర్ కె.నరేంధ్ర తెలిపారు.

# ఎంపీ చేతులుమీదుగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట




అనకాపల్లి : ఈనెల 10 వతేదీన కశింకోట మండలంలోని చింతలపాలెం గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతులుమీదుగా ప్రారంభించనున్నట్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, బుదిరెడ్డి చిన్న ఒక ప్రకనటలో తెలిపారు.ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావును క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేసాన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, పారిశ్రామిక వేత్త పరుచూరి భాస్కరరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు.

# కశింకోట మండలంలో పర్యటించిన జేసీ



అనకాపల్లి : కశింకోట మండలంలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ సృజన శుక్రవారం పర్యటించారు. గొబ్బూరు, సోమవరం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఘనస్వాగతం లభించింది. గొబ్బూరు గ్రామంలో పట్టాల పంపిణీని చేపట్టారు. ఎల్‌పీసీలు లబ్దిదారులకు అందజేసారు. అనంతరం లే అవుట్‌ను పరిశీలించారు. అలాగే, సోమవారం గ్రామంలో ఇటీవల నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. అర్హులైన ఇల్లులేని, నిరుపేదలందరికీ ఇళ్లు, మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, కశింకోట జెడ్పీటీసీ మలసాల ధనమ్మ, ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణరావు, ఎంపిపి పంచదార్ల లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కాయల మురళీ, తెలుగుదేశం పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బుద్ధ నాగజగదీష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కశింకోటలో పర్యటించిన ఎమ్మెల్యే



అనకాపల్లి : కశింకోట మండలంలో సోమవారం గ్రామంలో అనకాపల్లి శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ సైకిల్ యాత్రలో భాగంగా మండలంలో గ్రామంలో పర్యటించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పథాకాన్ని ఆవిష్కరించారు. సైకిల్‌పై గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హెూదా విశాఖ రైల్వే జోన్ కడప ఉక్కు కర్మాగారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న పోరాటానికి సంఘీబావం తెలియజేయాలన్నారు. కేంద్రంపై చేస్తున్న ధర్మపోరాటం ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో గొంతిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మలసాల దనమ్మ, ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణారావు, కాయల మురళీ, శిదిరెడ్డి శ్రీనివాసరావు, మళ్ల సురేంద్ర, బుద్ధ నాగజగదీష్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు నష్ట పరిహారం అందించే వరకూ ఓలం కంపెనీ లైసెన్సు రద్దు చేయాలి

గొలుగొండ : తమ వద్ద అమ్మకాలు చేస్తున్న జీడి పిక్కల రైతులను మోసం చేస్తున్న ఓలం కంపెనీ లైసెన్సును రద్దు చేయాలంటూ సిపిఎం మండల కార్యదర్శి సాపిరెడ్డి నారాయణ మూర్తి డిమాండ్ చేశారు. స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఓలం కంపెనీకి తగదన్నారు. రైతులు తెచ్చిన పిక్కలకు ధరను నిర్ణయించి, తర్వాత రోజు నాణ్యత లేదని ధర తగ్గించడం రైతులను మోసం చేయడమేనన్నారు. కంపెనీ నుంచి వెనక్కి జీడిపిక్కలను తెచ్చిన రైతులు వాటిని అమ్ముకునే సమయానికి బరువులో విపరీతమైన తేడా వచ్చి రైతులు నష్టపోయారన్నారు. ఓలం కంపెనీ మొదటగా నిర్ణయించిన ధరను రైతులకు నష్టపరిహారంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం చొరవ చూపి రైతులకు నష్టపరిహారం అందే వరకు కంపెనీ క్రయవిక్రయాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## నేడు వైకాపా బూత్ కన్వీనర్ల సమావేశం

రోలుగుంట : మండలంలోని రోలుగుంటలో శనివారం స్థానిక రామాలయం వద్ద మండల స్థాయి వైసిపి ముఖ్య నాయకుల, బూత్ స్థాయిలో కమిటీ సమావేశం జరగనుందని వైసిపి మండల అధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు తెలిపారు. ఈ సమావేశానికి చోడవరం వైకాపా సమన్వయకర్త కరణం ధర్మశ్రీ హాజరవుతారన్నారు. విధిగా అన్ని గ్రామాల నుంచి బూత్ స్థాయి కార్యకర్తలు, ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు.

## పశుసేవ కేంద్ర వాహనం ప్రారంభం



నర్సీపట్నం: శుక్రవారం నర్సీపట్నం పశువైద్య కేంద్రంలో పద్మావతి ట్రస్టు ద్వారా సంచార పశుసేవ కేంద్రం వాహనాన్ని మంత్రి అయ్యన్న అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్‌బాబు ప్రారంభించారు. సంచార సేవా కేంద్రం వాహనం వల్ల గ్రామాల్లో తిరుగుతూ పశువులకు వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని విజయ్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఏడి డాక్టర్ గణేష్, చైర్ పర్సన్ అనిత తనయుడు చింతకాయల వరుణ్, శింగంపల్లి శివాజీ పాల్గొన్నారు.

## దళితుల పట్ల వివక్ష తీర్పును సుప్రీంకోర్టు మానుకోవాలి



నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో సుప్రీంకోర్టు దళితుల పట్ల వివక్షత తీర్పులు మానకపోతే దళితులు ఆత్మ త్యాగాలకు సిద్ధపడతారని దళిత కులాలసంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పతివాడ రాంబాబు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పని చేసే చోట వివక్షలకు సంబంధించిన అరెస్టులపై తీర్పు వాయిదా వేయడం అన్యాయమన్నారు. జల్లికట్టు పందెం విషయంలో అత్యవసరంగా తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు కనీసం పశువులతోనూ ఆటలతోనూ పోల్చినా హీనపర్చడం వారి చదువుకూ ఔన్నత్యానికి వదిలేస్తున్నామన్నారు. మనుధర్మ భావజాలానికి పూర్తి మద్దతు పలికే విధంగా వ్యవహరించడం, న్యాయమూర్తులే న్యాయాన్ని అన్యాయంగా మార్చడం వల్ల దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో అనేక మంది అశువుల బాసినా స్పందించకపోవడం దారుణమన్నారు. మా మనోభావాలు పరిగణలోకి తీసుకొని ఇకనైనా దేశం మొత్తం మీద జరుగుతున్న దళితుల దాడులను దృష్టిలో పెట్టుకొని తీర్పు వెల్లడించాలన్నారు. సుప్రీంకోర్టు మీద దేశ ప్రజలకు, మరి ముఖ్యంగా దళితులకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగే విధంగా తీర్పును ప్రకటించాలన్నారు. కేంద్రం సుప్రీంకోర్టును నడిపిస్తుందనే ప్రకటించాలన్నారు.

కేంద్రం సుప్రీంకోర్టును నడిపిస్తుందనే నిందపోయేలా న్యాయమూర్తులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు మాటూరి చిన్నారావు, చిట్ల చలపతి, గాతాడ సహదేముడు, నక్కపల్లి నాగరాజు,మద్రా నాగరాజు, నేతల నాగేశ్వరరావు, బెల్లాల రాజుబాబు, ఆరుగుళ్ల రాజుబాబు, ఎమ్మార్పీఎస్ ఎం.సతీష్ పాల్గొన్నారు.

## జగన్ పాదయాత్రకు సంఘీభావంగా పాదయాత్రలు



నాతవరం: వైయస్సార్ పార్టీ అధ్యక్షులు వైయస్.జగన్ చేస్తున్న ప్రజాసంకల్ప పాదయాత్ర ఈ నెల 14తో 2వేల కిలో మీటర్లు పూర్తవుతున్న సందర్భంగా మండలంలో పాదయాత్ర చేస్తున్నట్లు నర్సీపట్నం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పెట్ల ఉమాశంకరగణేష్ అన్నారు. శుక్రవారం నాతవరంలో బూత్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాదయాత్రకు సంఘీభావంగా ఒక్క రోజు పాదయాత్రలు చేస్తున్నామన్నారు.

ఈ పాదయాత్రను విజయవంతంచేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అంకంరెడ్డి జమీలు, మండల పార్టీ అధ్యక్షులు పైల పోతురాజు, నాయకులు శెట్టి నూకరాజు పలువురు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ప్రమాద బీమా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఎడిటర్లు, సబ్ ఎడిటర్లు, ఫొటోగ్రాఫర్లు, కెమెరామెన్లు, 2018-19 ప్రమాద భీమాపథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పౌరసంబంధాల అధికారి పి.గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బిఐ సహాయ సంచాలకుల పేరుమీద ఉన్న బ్యాంకు అకౌంటు నెంబరు 35688241321 సేవింగ్ ఖాతాలో 204 రూపాయలు చెల్లించి, బ్యాంకు ఛార్జీలతో 60 రూపాయలు కలిపి 264 రూపాయలు ఈనెల 9వ తేదీలోగా చెల్లించి కౌంటర్‌పాయిల్ నిర్ణిత దరఖాస్తుకు జతచేసి డిపిఆర్ఓ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు.

బ్యాంకులు అందుబాటులో లేనివారు సదరు ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తున్నవి.సిహెచ్.కృష్ణకు, డివిజనల్ పిఆర్ఓ పార్వతీపురం కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎస్.విజయలక్ష్మిలకు ప్రిమియం సొమ్మును అందజేయవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రిమియం చెల్లించిన జర్నలిస్టులు వారి సంస్థ గుర్తింపు కార్డు లేదా అక్రిడిటేషన్ కార్డుతో పాటు ఆధార్ జెరాక్స్‌ప్రతులు జతపర్చి అందజేయాలన్నారు. బ్యాంకు రశీదు (కౌంటర్‌ఫాయిల్) వెనుక భాగాన ప్రిమియం కట్టిన వారి పేరు, మొబైల్ నెంబరు సంస్థ పేరు వ్రాయాలన్నారు. జర్నలిస్టులు ప్రమాదభీమాలో చేరినవారు ప్రమాదవశాత్తు చనిపోతే, శాశ్వత, పాక్షిక శాశ్వత అంగవైకల్యం అంగవైకల్యం సంభవించి పనిచేయు స్థితిలో లేనివారకి 10లక్షలు మంజూరుచేయడం జరుగుతుందన్నారు. పూర్తి అంగవైకల్యం చెందిన వారికి వారానికి 5 వేలు వంతున గరిష్టంగా 104 వరకు వారాల వరకు పారితోషకం ఇవ్వబడుతుందన్నారు. చనిపోయినా, శాశ్వత అంగవైకల్యం వారి పిల్లలకు విద్యానిధి కింద ఒక విద్యార్థికి 5 వేలు రూపాయలు చొప్పున ఇరువురి పిల్లల వరకు మాత్రమే 10వేలు ఇవ్వబడును. వైద్య ఖర్చులుకూడా చెల్లించబడునన్నారు. ఈ అవకాశాన్నిఅర్హులైన జర్నలిస్టులందరూ సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

# ఆంధ్రాకు ఒడిశా శఠగోపం!

విజయనగరం : ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొఠియా గ్రూపు గ్రామాల సమస్య రాజ్యాంగ వివాదంగా మారింది. ఇందుకు విజయనగరం జిల్లా అధికారులు, పాలకులదే ఈ పాపమని చెప్పక తప్పదు. విజయనగరం జిల్లా కలెక్టర్ దుందుడుకు చర్య ఒడిశాకు కలిసివచ్చేలా చేస్తే ఆంధ్రాకు శాపంలా పరిణమించనుంది. కొఠియా గ్రూపు గ్రామాలపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడి 11 సంవత్సరాలు గడిచినా ఇంతవరకూ జిల్లాకు చెందిన పాలకులుగానీ, ప్రజాప్రతినిధులు గానీ ఏ మాత్రం స్పందించలేదు సరికదా ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఇటీవల కాలంలో వ్యవహరించిన తీరు పాతగాయాన్ని మరింత రేపినట్లు అయింది.

***కొఠియా వివాదం ఈ నాటిది కాదు..***

వాస్తవానికి కొఠియా గ్రూపు గ్రామాలు విజయనగరం జిల్లా సాలూరు మండలంలో ఉన్నాయి. సాలూరు నుంచి సుంకి మీదుగా జయపూర్‌కు వెళ్లే దారిలో ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఈ గ్రామాలు విస్తరించనున్నాయి. కొఠియా గ్రామం పేరున మొత్తం 27గ్రామాలు ఉండగా సుమారు ప్రస్తుతం సుమారు 6వేల మంది వరకు జనాభా ఉంటారు. వీరంతా స్థానిక గిరిజన తెగకు చెందిన వారు. కాగా మొట్టమొదటిసారిగా ఈ వివాదం 1968లో ఏర్పడింది. అదికూడా ఒడిశా ప్రభుత్వమే సుప్రీంకోర్టులో ఈ గ్రామాలు తమవేనంటూ కేసు వేసింది. (ఓఎస్ 10/68). పనిలో పనిగా ఆంధ్రా అధికారులు ఈ గ్రామాల్లోకి ప్రవేశించకుండా ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేయాలని అప్పట్లోనే ఒడిశా ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. ఇందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు స్టేటస్‌కో (యథాతథస్థితి) ఉత్తర్వులను మాత్రమే జారీ చేసింది. అంటే అప్పటికే కొఠియా గ్రూపు గ్రామాలపై అటు ఆంధ్రా ఇటు ఒడిశా ప్రభుత్వాల పాలన ప్రభావం కొఠియా గ్రూపు గ్రామాలపై ఉంది. ఈ నేపథ్యంలో ఈ కేసుకు సంబంధించి విచారణ చేసేందుకు ఒడిశాలోని జయపూర్ జిల్లా జడ్జిని కమిషనర్‌గా సుప్రీంకోర్టు నియమించింది. ఈ ప్రక్రియ 1994లో జరిగింది. అప్పటివరకు కేసు విచారణ జరగలేదు. ఈ పరిస్థితుల్లో జయపూర్‌లో కమిషన్ ఎదుట ఆంధ్రా తరపున సాక్షాలను విచారించడానికి, సంబంధిత పత్రాలను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వన్యాయవాదిగా (జీపి) పనిచేస్తున్న ఎస్ఎస్ఎస్ఎస్ రాజును ప్రత్యేక కౌన్సెలర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ విషయంలో అప్పటి జిల్లా కలెక్టర్ పూనం మాలకొండయ్య చొరవ చెప్పుకోవాల్సిందే. 2001వరకు జయపూర్‌లో కేసు విచారణ జరిగింది. మొత్తం 85వాయిదాలు జరగగా ఆంధ్రా తరపున ఇరువురు సాక్షులు, ఎనిమిదివేల పత్రాలను ప్రవేశపెట్టారు. ఒడిశా తరపున నలుగురు సాక్షులు, 10వేల పత్రాలను ప్రవేశపెట్టారు. దీంతో కమిషన్ విచారణ పూర్తయింది. ఈ పత్రాలను అన్నింటిని ప్రత్యేక ట్రంకు పెట్టెల ద్వారా 2002లో ఢిల్లీకి ప్రత్యేకరైలులో సుప్రీంకోర్టుకు తరలించారు. వీటన్నింటిని పరిశీలించిన సుప్రీంకోర్టు ఇరు రాష్ట్రాల వాదనలను విన్న తరువాత 2006లో తుది తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని 3వ అధికరణం ప్రకారం రాష్ట్రాల సరిహద్దుల మార్పు, కొత్త రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్రాల పేరు మార్పు అధికారం పార్లమెంటుకే ఉన్నందున కొఠియా గ్రూపు గ్రామాల వివాదాన్ని పార్లమెంటులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్లమెంటులో ఈ వివాదం కొలిక్కి వచ్చేంతవరకూ కొఠియా గ్రూపు గ్రామాలపై స్టేటస్‌కోను కొనసాగించాలని సుప్రీం తీర్పులో పేర్కొంది. దీని ప్రకారం ఇప్పటికి కూడా కొఠియా గ్రూపు గ్రామాలపై ఆంధ్రాకు కూడా సంపూర్ణ అధికారాలు ఉన్నాయన్నది సుస్పష్టం.

***పాలకుల నిర్లక్ష్యం..***

విశేషమేమిటంటే ఈ కేసు విచారణ సమయంలో సాలూరు ఎమ్మార్వోగా ప్రస్తుత జిల్లా రెవెన్యూఅధికారి రాజకుమార్ పనిచేశారు. ఈ కేసులో ఆంధ్రా తరపున ప్రవేశపెట్టిన ఇరువురు సాక్షుల్లో ఒకరు రాజకుమార్ కాగా, మరొకరు అప్పటి ఐటిడిఏ పీవోగా పనిచేసిన వీరబ్రహ్మయ్య. నాటి నుంచి నేటివరకు పాలకులు ఈ విషయం పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు తీర్పును గమనించలేదు. కొఠియా గ్రూపు గ్రామాలను గాలికొదిలేశారు. అధికారులు సైతం మమ అనిపించారు. ఈ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా విఫలమైందనేది బహిరంగ రహస్యం. ఈ గ్రామాల్లో తెలుగుభాషను విస్తృతం చేసి సంస్కృతిని, సంప్రదాయాన్ని అక్కడ గిరిజనులకు అలవాటు చేసేందుకు ఏ ఒక్క చర్యా చేపట్టలేదు. దీంతో అక్కడి గిరిజనులు ఆంధ్రాకు క్రమంగా దూరమవుతూ వచ్చారు. ఇప్పటికీ కూడా ఈ గ్రామాల ప్రజలు తమ ప్రతీ అవసరానికీ పొరుగునే ఉన్న ఒడిశా పట్టణాలపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో తగుదునమ్మా అంటూ ప్రస్తుత జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ కొఠియా గ్రూపు గ్రామాల్లో కలియతిరిగారు. దీంతో అగ్నికి ఆజ్యం తోడైంది. ఇప్పటివరకు కొఠియా గ్రూపు గ్రామాలను పట్టించుకోని జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఆ గ్రామాల్లో పర్యటించడంతో అప్పటివరకు నిస్తేజంగా ఉన్న ఒడిశా అధికారులు అప్రమత్తమయ్యారు. ఒక్కొక్కరిగా కొఠియా గ్రూపు గ్రామాలు చేరుకున్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మౌలిక సౌకర్యాల కల్పన చేశారు. ఆంధ్రా పేరున ఉన్న కార్యాలయాలను తొలగించారు. ఇంతజరిగినా జిల్లా యంత్రాంగానికి చీమకుట్టినట్టు లేదు. మరోవిశేషమేమిటంటే ఇంతజరుగుతున్నా ప్రస్తుత డిఆర్ఓగా పనిచేస్తున్న అప్పటి సాలూరు ఎమ్మార్వో రాజ్‌కుమార్ ఒకముక్క కూడా కలెక్టర్‌కు వివరించలేదు. జిల్లా కలెక్టర్‌కు కొఠియా గ్రూపు గ్రామాల వివాదం తెలిసినట్లు కనిపించదు. ఎందుకంటే, గత కొద్దిరోజులుగా ఈ తతంగాన్ని మీడియా ద్వారా గమనించిన అప్పటి ప్రత్యేక కౌన్సెలర్, ప్రభుత్వ న్యాయవాది ఎస్ఎస్ఎస్ఎస్‌విఆర్ఎం రాజు ఉండబట్టలేక మొత్తం ఫైల్‌నంతా తీసుకొని కలెక్టర్ వద్దకు వెళ్లి వివరించారు. అయినా సరే స్పందన కరువైంది. కొఠియా గ్రూపు గ్రామాల వివాదంపై సమాచారాన్ని ప్రభుత్వానికి ఇచ్చివుంటే ఇప్పటికే ఈ విషయం పార్లమెంటులో చర్చకు వచ్చేది.

జిల్లాలో కేంద్రమంత్రి అశోక్‌గజపతి రాజు, రాష్ట్రమంత్రి సుజయకృష్ణ రంగారావు ఉన్నారు. ప్రజాప్రతినిధులకు జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహకారం అందించి కొఠియా గ్రూపు గ్రామాల వివాదాన్ని పార్లమెంటులో వినిపిస్తేగానీ సమస్యకు పరిష్కారం కాదు. అంతవరకు ఆ గ్రామాలపై ఆంధ్రా ప్రభుత్వానికి సర్వహక్కులు ఉన్నాయి. ఒడిశా ప్రభుత్వం బొర్రా గుహలు విషయంలో సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. 2010లో సుప్రీంకోర్టు ఈ కేసుపై తీర్పు ఇస్తూ బొర్రా గుహలు ఆంధ్రా రాష్ట్రానివేనని స్పష్టం చేసింది. కనీసం అప్పుడైనా పాలకులు, అధికారులు పార్లమెంటు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లివుంటే ఈ వివాదం ఇంతదాకా వచ్చేదికాదు.

## 6న ఉచిత మెగా వైద్య శిబిరం

కొయ్యూరు: జలుమూరి వారి చేయూతలో భాగంగా ఈనెల 6న కొయ్యూరు గ్రామంలో ఆశ్రమ పాఠశాల(2) వద్ద(సంతబయలు సమీపంలో) కొయ్యూరు గ్రామస్థుల సహకారంతో విశాఖపట్నం భీమునిపట్నం అనిల్‌నీరుకొండ(ఎన్ఆర్ఐ) ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జలుమూరి వెంకట గిరిబాబు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బిపి, గుండెదడ, ఆయాసం, గుండెలో నొప్పి, ఛాతిలో మంట, అజీర్తి, కడుపు మంట, విరేచనాలు, చిన్న పిల్లల అన్ని రకాల వ్యాధులు, సుగర్, కాళ్లు పీకులు, ముడుకుల నొప్పులు, ఫిట్స్, వాతం, నరాల వ్యాధులు మూత్ర పిండాలలో రాళ్ళు మూత్రపిండాల నొప్పి, స్త్రీ సంబంధిత వ్యాధులు, మూత్రంలో రక్తం, చెవి నొప్పి వాడే కారడం, తలనొప్పి గొంతు నొప్పి, చెవిలో హోరు, వినికిడి మిగిలిన అన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షించిన అనంతరం ఉచితంగా మందులు ఇవ్వబడునన్నారు. అవసరమైన వారికి అనిల్‌నీరుకొండ(ఎన్ఆర్ఐ) తగరపువలస, భీమునిపట్నం ఆసుపత్రులలో ఉచితంగా వైద్యం, శస్త్ర చికిత్సలు చేయబడునన్నారు. వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించబడునన్నారు. మరెన్ని వివరాలకు 9440727511 నెంబరుకు సంప్రదించాలని సూచించారు.

## సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి

కొయ్యూరు: మండలంలో వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు తగిన తోడ్పాటు అందించాలని తహశీల్దార్ వీఆర్వోలు వి.రమాదేవికి వినతిపత్రం ఇచ్చారు.

శుక్రవారం వీఆర్వోల సంఘం నాయకులు వి.లింగాలు ఆధ్వర్యంలో వీఆర్వోలు సమస్యతో కూడిన వినతిపత్రంను తహశీల్దార్‌కు అందించారు. రాష్ట్రలో 9860మంది వీఆర్వోలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రతీ పంచాయతీ కేంద్రంలో వీఆర్వో కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం వీఆర్వో హంసాదేవి, మంప వీఆర్వో పండయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



రావికమతం: మర్రివలస గ్రామంలో నూతనంగా నిర్మించే రామాలయ శంకుస్థాపనను శుక్రవారం పెందుర్తి శ్రీదత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త లోకేశ్వరానంద స్వామిజి వారి ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్వామివారి ఆధ్వర్యంలో పలు హోమాలు, పూజలు జరిపారు. గ్రామంలో సుమారు 60 ఏళ్ల క్రితం ఉన్న పురాతన రామాలయాన్ని తొలగించి అదే స్థానంలో నూతన రామాలయానికి పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణానికి రాజన్న పౌండేషన్ అధినేత పివిఎస్ఎన్.రాజు గ్రామస్థుల సహకారంతో పనులు ప్రారంభించారు.

## వైద్యశాలల పనివేళల్లో మార్పు

విజయనగరం: నవ వైద్యశాలలు పనిచేయు వేళల్లో మార్పు చేయటం జరిగిందని జిల్లా కలక్టర్ వివేక్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు జి.ఓ విడుదలైందన్నారు. మున్సిపల్, కార్పరేషన్ పరిధిలో గల అన్ని పశు వైద్యశాలలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు మరలా మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు వైద్యసేవలు అందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్యశాలలు ఉదయం 9 గంటనుంచి సాయంత్రం 4.30 గంటల వరకు , అత్యవస పరిస్థితుల్లో అన్ని వేళలా పశువైద్య సేవలు అందించాలన్నారు.

సకాలంలో సేవలు అందించని పక్షంలో టోల్ ఫ్రీ నెంబరు 1962 ను సంప్రదించాలని కోరారు. పాడిరైతులు ఈ విషయాలను గమనించాలని తెలిపారు.

# ఇక సదరం సులభతరం

విజయనగరం : జిల్లాలో దివ్యాంగ లబ్ధిదారులు ధృవీకరణ పత్రాలు (సదరం) సులభతరంగా పొందేందుకు ప్రస్తుతం ఉన్న విధానానికి కొన్ని మార్పులు చేసామని జిల్లా కలక్టర్ వివేక్‌యాదవ్ తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ, సర్ఫ్, ఐసిడిఎస్, సామాజిక న్యాయం, మీ సేవ, ఎపి ఆన్‌లైన్ తదిత శాఖల మధ్య సమన్వయంతో కొత్త విధానాన్ని అభివృద్ధి చేయడమైందన్నారు. సులభతరంగా కంప్యూటర్ ఆధారిత దివ్యాంగ ధృవీకరణ పత్రాల జారీ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ నూతన విధానం జూన్ 1వ తేదీనుండి అములులోకి రానుందన్నారు. వారంలో ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 12.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకుజిల్లాలో మెడిల్ బోర్డు సౌకర్యం గల మహారాజా జిల&ఆ ఆసుపత్రి, పార్వతీపురం ప్రాంతీయ ఆసుపత్రులకు సదరం ధృవీకరణ పత్రాల కొరకు వైద్యపరమైన ధృవీకరణ మాత్రమే జరుగుతుందన్నారు. దివ్యాంగులు రిజిస్ట్రేషన్, సదరం ధృవపత్రాలు జారీ మొత్తం మీ-సేవ కేంద్రాల వద్ద జరుగుతుందన్నారు. అందరు దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

# వానలకు.. వరదలకు లోతట్టుప్రాంతాలు జలమయం..

### భారీఈదురుగాలులు

### మెంటాడలో 400 ఎకరాల్లో పంట నష్టం

### సముద్రంలో గల్లంతైన మత్స్యకారులు

విజయనగరం: బంగళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల విజయనగరం జిల్లా వ్యాప్తంగా రెండురోజులుగా కురిసిన భారీవర్షానికి మెంటాడ మండలంలో సుమారు 400 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, మెంటాడ, గుర్ల మండలాల్లో భారీ ఈదురుగాలులతో పాటు భారీవర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా జిల్లాకేంద్రమైన విజయనగరంతో పాటు అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

బెంగాల్‌లో కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం కారణంగా దాని ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపైన ఉంటుందని, దాంతో పాటు పలు ప్రాంతాల్లో తీవ్రమైన ఉరుములు, పిడుగులు పడవచ్చని విపత్తుల నిర్వహణ శాఖ గురువారం హెచ్చరిక జారీచేసింది. రెండురోజుల క్రితం పడిన వర్షానికి భోగాపురం మండలం కొండరాజుపేట తీరప్రాంతంలో సముద్రంలో పడవ బోల్తాపడి గల్లంతైన ఇద్దరు మత్స్యకారుల్లో ఒకరైన చిన్నఅమ్మోరు మృతదేహం గురువారం ఉదయం తీరానికి కొట్టుకొచ్చింది. అకాల వర్షాలు మరోరెండు రోజుల పాటు పడే అవకాశముందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. జిల్లాలోని తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం ప్రాంతాల్లో మత్స్యకారులు సముద్రంలోకి చేపటలవేటకు వెళ్లకుండా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఈ రెండు మండలాల్లో పరిస్థితులను జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంది. ఆయా ప్రాంతాల రెవెన్యూ అధికారులు సముద్రతీరప్రాంతాల్లో తిష్టవేసి ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

# ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా, పుణ్యవచనం అమ్మవారికి మూల, మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు గాడేపల్లి.వెంకట్రావు ఆద్వర్యంలో అర్చకులు చెళ్ళపిళ్ళ.ప్రసాద్ శర్మ, నాగాభట్ల. కామేశ్వరరావు, కంచిభట్ల.కుమార్, శ్రీఘాకోళపు. గోపి తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, ఎసి.ఈరంకి. జగన్నాధరావు, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారాయణ, సీసీ గణపతి, ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ, ప్రసాదాలు అందజేసారు

# చిన్నారులపై అత్యాచారాలు అరికట్టాలి



రావులపాలెం : సమాజంలో చిన్నారులపై నానాటికి అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారికి ఉరిశిక్ష విధించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ముస్లిం సంఘ పెద్దలు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద, పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసారు. అభంశుభం తెలియని చిన్నారులపై అమానుషంగా అత్యాచారాలకు పాల్పడుతున్నారని మొన్న జరిగిన అత్యాచారం మరువకముందే గుంటూరు జిల్లా దాచేపల్లిలో చోటు చేసుకుందని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అత్యాచారాలకు పాల్పడిన వ్యక్తులకు ఉరిశిక్ష, ఎన్‌కౌంటర్ చేయాలని సంఘం తీర్మానించింది. ఈ సందర్భముగా ముస్లిం హక్కుల పోరాట సమితి అత్యాచారాలకు వ్యతిరేకిస్తూ తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఖాన్, గౌస్ మొహిద్దీన్ సిరాజ్, సులేమాన్, జాకిర్, ఉమర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# 6న మంత్రి మల్లాడి చేతులమీదుగా మసీదు ప్రారంభం

యానాం : భక్తుల విరాళాలతో అధునాతనంగా ఫ్రాన్స్‌తిప్పలో నిర్మిస్తున్న మసీదును పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి చేతుల మీదుగా ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు నిర్మాణ కమిటీ అధ్యక్షుడు సయిద్ అబీబుల్లా తెలిపారు. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, పంప్రదాయాలతో ప్రసిద్ధికెక్కిన యానాంలో ప్రధాన పర్యాటక కేంద్ర అయిన కోనావెంకటరత్నం నగర్‌లో మసీదును ఈ నెల 6న 9 గంటలకు ప్రారంభించనున్నారు. మసీదు నిర్మాణయోచనలోఉన్న తమకు హైదరాబాద్‌కు చెందిన ఒక ముస్లిం భక్తురాలు స్థలాన్ని కొనుగోలుచేసి నిర్మాణ పనులు నిమిత్తం నిర్మాణ వ్యయంలో 60 శాతం వరకు విరాళం ఇచ్చి అన్ని విధాల సహకరించారన్నారు. నిర్మాణానికి సంబంధించిన మిగిలిన మొత్తాన్ని ముస్లిం భక్తులు సమకూర్చేరన్నారు. సుమారు 250 మంది నమాజ్ చేసుకొనేందుకు వీలుగా నిర్మిస్తున్న మసీదులో విద్యార్థులకు విద్యాబోధన చేసేలా ముస్లిం ఉద్యోగులు విద్యావంతులతో ప్రత్యేక తరగతులు ఏర్పాటుచేస్తామని కుల మతాలకు అతీతంగా అందరికీ విద్యాబోధన కల్పించేందుకు నిర్మాణం తరువాత చర్యలు చేపడతామన్నారు.

పట్టణంలోని మసీదువీధులో ఉన్న పాత మసీదును ఫ్రెంచిపాలనలో నిర్మించారన్నారు. 1978లో పునరుద్ధరించార న్నారు. 1996 నవంబర్ 6న తుఫాన్ తరువాత మరమ్మతులు చేసామన్నారు. మంత్రి మల్లాడి క్రిష్ణారావు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో అధునీకరించామన్నారు.

# అతి తక్కువ సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించగలిగాం

## హెచ్.వై.దొర, సిఎండి, ఎపీఈపీడీసీఎల్

విశాఖపట్నం : మంగళ, గురువారాలలో ఈదురు గాలులతో కూడిన వర్షాల ప్రభావంగా ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను సంస్థ సిబ్బంది రేయింబవళ్ళు కష్టపడి విద్యుత్‌ను తక్కువ సమయంలో పునరుద్ధరించగలిగారని సిఎండి హెచవైదొర తెలిపారు. వర్షాలకారణంగా పడిపోయిన విద్యుత్ స్తంభాలను, తెగిపడిన విద్యుత్ తీగలను, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేయడం జరిగిందని వినియోగదారుల నుండి 1912కు వచ్చిన ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని వాటిని క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేయటం ద్వారా అత్యంత తక్కువ సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించగలిగామన్నారు.

అకాల వర్షాల కారణంగా ఏర్పడే విద్యుత్ సమస్యలను పరిష్కరించటానికి అవసరమైన యంత్రాంగాన్ని, సిబ్బంది సిద్ధంగా ఉంచాలని సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం; విశాఖపట్నం, తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లకు సిఎండి హెచఎవై దొర ఆదేశాలిచ్చారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్‌వైర్లు, పడిపోయిన విద్యుత్ స్థంభాలు, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు పట్ల వినియోగదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని వాటికి సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912కు సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియజేయాలన్నారు.

# ఎస్ఎస్‌సి ఫలితాలలో నారాయణ ప్రభంజనం

పెద్దాపురం : పెద్దాపురం పట్టణంలో గల నారాయణ పాఠశాల విద్యార్థులు ఎస్ఎస్‌సి ఫలితాలలో విజయకేతనం ఎగురవేసారని ప్రిన్సిపాల్ సిహెచ్ శ్రీనివాస్, హరిప్రసాద్ తెలిపారు. 2017-18 సంవత్సరంనకు హాజరైన 36 మంది విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడుగురు 10/10, ఆరుగురు 9.8/10 సాధించారని తెలిపారు. మరియు సబ్జెక్టుల వారీగా గ్రేడులు సాధించి తిరుగులేని ఫలితాలు పొందారని తెలిపారు. ఇంతటి విజయం సాదించిన విద్యార్థులను పెద్దాపురం డిజిఎం రాఘవేంద్రరావు, డీన్ హరిప్రసాద్ అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దీనికి సహకరించిన ఉపాధ్యాయులు, తలిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థులను అభినందించారు.

# ఉద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

యానాం : వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులకు స్థానిక ఎర్రగుంటవారి వీధిలోని శ్రీసాయి అసోసియేషన్ ట్రైనింగ్ కోర్సులలో శిక్షణా తరగతులను పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు ప్రారంభించారు. కొత్తగా నేర్చుకొనే ఏ అంశమైనా ఉద్యోగుల పనితీరును కచ్చితంగా మెరుగుపరుస్తుందని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటి అండ్ సి సెంటర్ హెడ్ డి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 10న ఉద్యోగుల ఆందోళన

యానాం : పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించవలసిన 7వ సంఘ సిఫారుసుల బకాయిలు తక్షణం చెల్లించని పక్షంలో దశలవారీగా ఈ నెల 10 నుండి 17 వరకు ఆందోళనకు సిద్ధం అవుతున్నట్లు పుదుచ్చేరి యూనిఫైడ్ మినిస్ట్రియల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రదాన కార్యదర్శి ఎ. రాజేంద్రన్ మాట్లాడుతూ ఈ నెల 10న ట్రజరీ వద్ద, 17న విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగుల సంఘాల సభ్యులు సదస్సు నిర్వహిస్తారన్నారు. కేంద్ర ఉద్యోగులతో సమానంగా అసిస్టెంట్లుకు వేతనాలు పెంచాలని ఖాళీగా ఉన్న యుడిసి, సూపరింటెండెంట్ జూనియర్ అకౌంట్స్ అధికారి, సీనియర్ అకౌంట్స్ అధికారి, సిఎస్ అధికారి పోస్టులను తక్షణం భర్తీచేయాలని డిమాండ్‌చేశారు.

# హెరిటేజ్ డెయిరీ పాడిరైతు పిల్లలకు స్కాలర్‌షిప్

అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ పాడిరైతు పిల్లలకు అందిస్తున్న స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుచేసుకోవాలని అచ్యుతాపురం శాఖ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెరిటేజ్ డెయిరీకి పాలుపోస్తున్న పాడిరైతు పిల్లలు, డెయిరీ ట్రస్టులో సభ్యత్వం ఉన్న పాడిరైతు పిల్లలలో 2018 సంవత్సరం 10వ తరగతిలో 90 శాతం పైన మార్కులు సాధించిన విద్యార్థులకు హెరిటేజ్ డెయిరీ స్కాలర్‌షిప్ మంజూరు చేస్తుందన్నారు. గ్రామాలలో ఉన్న పాలసంఘ అధ్యక్షుల వద్ద దరఖాస్తులు ఉన్నాయని ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులు పూర్తిచేసి స్థానిక హెరిటేజ్ ప్లాంట్ మేనేజర్‌కు అందచేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9666651619 సంప్రదించాలన్నారు.

# ఆలమూరు మేజిస్ట్రేట్‌గా అమర లింగేశ్వరరావు



ఆలమూరు : ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్‌గా హెచ్. అమర లింగేశ్వరరావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎమ్. సుబ్బారావు కృష్ణాజిల్లా నూజివీడుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీకావడంపై ఏర్పడిన స్థానంలో కృష్ణాజిల్లా అవనిగడ్డ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అమర లింగేశ్వరరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేగుళ్ళ రామమోహన్ కుమార్, కార్యదర్శి కె.భీమశంకరం, కె.నారాయణరెడ్డి, వి.వి.వి. సత్యనారాయణమూర్తి, తదితర న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలుసుకొన్నారు.

# జనుపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



అమలాపురం : మండలంలోని జనుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చుట్టుగుళ్ల జ్యోతి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అంబాజీపేట లేజర్ రైట్ కంటి ఆసుపత్రి వారు వైద్యులు లాజర్, సిబ్బంది వృద్ధులకు, గ్రామ ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 30మంది వరకూ వైద్య పరీక్షలు నిర్వహించగా, ఒకరిని శస్త్ర చికిత్స నిమిత్తం ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఈతకోట సత్యవతి, మాజీసర్పంచ్ వేమన సత్యనారాయణ, ఆత్మా ఛైర్మన్ లింగోలు పెదకాపు, వార్డు సభ్యులు, గెడ్డం త్రిమూర్తులు, కొలిశెట్టి రామచంద్రరావు, వేమన సూరిబాబు, గ్రామ కార్యదర్శి రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కంకణం కట్టుకున్న పోలీసులు



పెద్దాపురం : పెరిగిన జనాభ, విపరీతంగా వాడుతున్న వాహనాల వలన పట్టణంలో ప్రధానమైన మెయిన్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య చాలాకాలంనుండి పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులలో ఇటీవల కొత్తగా సిఐగా బాధ్యతలు స్వీకరించిన వైఆర్‌కె శ్రీనివాస్, కమీషనర్ శేషాద్రి ఆధ్వర్యంలో పట్టణంలో మెయిన్ రోడ్డులో గల ఆక్రమణలు తొలగించడం, అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించడం వంటి చర్యలు చేపట్టడంతో ఒక్కసారిగా మెయిన్ రోడ్డులో మార్పు కనిపించింది అంటున్నారు. గతంలో పోలీసులు నిర్లక్ష్యం వహించారని ఇప్పటికైనా చర్యలు చేపట్టినందుకు ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


పలు ముఖ్యమైన సెంటర్లలో ఉన్న ఆక్రమణలను తక్షణం తొలగించి మెయిన్ రోడ్డులో పార్కింగ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. టిపిఒ భాస్కర్, ఎస్ఐ కృష్ణభగవాన్, లక్ష్మీ, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సినిమా టిక్కెట్లు ధరలను నియంత్రించాలి

తాళ్లరేవు: సినిమాహాళ్ళ ఆర్థిక దోపిడిని నియంత్రించాలని కర్తవ్యం యోజన సంఘం సభ్యులు తాహశీల్దారు లోధా జోసఫ్‌కు వినతిపత్రం అందించారు. తాళ్లరేవు నీలపల్లిలో ఉన్న సినిమా హాలులు టిక్కెట్లు ధరలు స్థిరత్వంలేకుండా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్త సినిమా విడుదలయిన రోజున రూ. 600 వరకు టిక్కెట్ ధర ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వసూలు చేస్తున్నారన్నారు. మొదటి 10 రోజులపాటు టిక్కెట్ ధర 200 మించి అమ్మటం చట్ట వ్యతిరేకం అన్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు పార్కింగ్ టిక్కెట్‌లు ఇష్టానుసారంగా వసూలుచేస్తున్నారన్నారు. పార్కింగ్ టిక్కెట్ ధర ముద్రించిన రశీదు లేకుండా వసూలు దందా చేస్తున్నారని పేర్కొన్నారు.

వినోదం కోసం సినిమా హాలుకు వెళ్ళే ప్రజలను నిలువదోపిడీచేస్తున్న సినిమాహాళ్లపై చర్యలు తీసుకోవాలని యువ జన సంఘం ప్రతినిధులు విత్తనాల ఖరినెల్ల స్వామి, డి. ఉమా, ఎస్. ఆదిత్య, ఎల్. సద్గురు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జిత్తుక అప్పారావు మృతి తీరనిలోటు



అమలాపురం : అంబాజీపేట లీజర్ కాలనీకి చెందిన ఫాస్టర్ జిత్తుక అప్పారావు (99) మృతి ప్రభు బిడ్డలకు తీరని లోటని అమలాపురం మండలం ఇందుపల్లి, బొంతువారిపేట జిడిఎం సంఘ పెద్దలు అన్నారు. అప్పారావు 1938 సంవత్సరంలో సమనస నుండి అమలాపురం వరకు కాలి నడక వచ్చి ప్రభు కోసం పరిచర్య చేసి అనేక మంది దైవ సేవకులను దైవజనులను ఏర్పాటు చేశారన్నారు. అంబాజీపేట ఉమెన్స్ హాస్పిటల్ డాక్టర్ లీజరమ్మ ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్మాణానికి ప్రధాన సహకారాలు అందించారన్నారు. 200 క్రిస్టియన్ వివాహాలు ఆయన ఆధ్వర్యంలో జరిపించారని, కోనసీమ పరిసర ప్రాంతాల్లో 32 ప్రార్ధన మందిరాలను ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం గర్వించదగిన విషయం అన్నారు. అప్పారావు మృతికి సంతాపంగా ఆయన కుటుంబ సభ్యులైన ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడును సంఘస్థులు పరామర్శించినట్లు జిడిఎం సంఘస్థులు తెలియజేశారు. అప్పారావు మృతిపట్ల సంఘ పెద్దలు, సంఘస్థులు నాగాబత్తుల రాజు, ఊటాల అర్జునరావు, పాలమూరి దామోదరావు, బొంతు ప్రకాష్, ఊటాల ప్రభాకర్, ఊటాల ఏడుకొండలు, బొంతు వెంకటేశ్వరరావు, పెనుమాల ఏడుకొండలు, పాలమూరి రమణ, ఊటాల వెంకట నరసింహారావు తదితరులు సంతాపం వ్యక్తం చేసారు.

# చురుకుగా జర్నలిస్టుల అక్రిడేషన్ల జారీ

## ఈ నెల 9లోగా కాంప్రెహెన్సివ్ ఇన్సూరెన్సు పాలసీ స్కీం ప్రీమియం చెల్లించాలి

## సమాచార శాఖ డిడి వి. మణిరాం

విశాఖపట్నం : జర్నలిస్టులకు అక్రిడేషన్లు జారీచేసే ప్రక్రియ చురుకుగా సాగుతోందని సమాచార శాఖ ఉప సంచాలకులు వి. మణిరాం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల క్రితం ప్రారంభమైన అక్రిడేషన్ల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 1700 కమిటీ సిఫార్సు మేరకు అక్రిడేషన్లు మంజూరుచేసి జర్నలిస్టులకు అందించడం జరిగిందన్నారు. మంజూరైన జాబితాను రైల్వే, ఆర్టీసీ శాఖలకు పంపడం జరిగిందని వారు పాసులను కూడా పొందుతున్నారని పేర్కొన్నారు. ఇంకా కొంతమంది వారి డాక్యుమెంట్లను పరిపూర్ణంగా సమర్పించనందున కార్డులు పెండింగులో ఉన్నాయన్నారు. అదే విధంగా జర్నలిస్టుల ఇన్సూరెన్సు పథకం క్రింద కూడా జర్నలిస్టులకు ఫెసిలిటేట్ చేయుటకు, వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసేందుకు ప్రత్యేకంగా కార్యాలయపు సిబ్బంది ఫోటోలు, చలానాలు ఇతర వివరాలను అప్‌లోడ్ చేయడం జరుగుతోందని తెలిపారు. అక్రిడేషన్లు, హెల్త్ ఇన్సూరెన్స్, ఇతర అధికారిక సమాచారాన్ని డిడి ఐ అండ్ పి.ఆర్ వాట్సాప్ గ్రూపులో పోస్టుచేయడం జరుగుతోందన్నారు.

జర్నలిస్టులకు కాంప్రహెన్సివ్ ఇన్సూరెన్సు పాలసీ స్కీం కోసం రూ. 204 డిపిఆర్వో ఖాతాలో చెల్లించి అ స్లిప్పును నిర్దేశిత దరఖాస్తు ఫారం జతచేసి ఈ నెల 9వ తేదీలోగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు. అక్రిడేషన్ కార్డు జిరాక్స్ ప్రతిని జతచేయాలని, లేని వారు వారి సంస్థ జారీచేసిన లేటెస్ట్ గుర్తింపు కార్డును జత చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య కార్డులకు సంబంధించి ఈ ఏడాదికి అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులు 1250రూపాయలు చలానా చెల్లించి, నిర్దేశిత దరఖాస్తును పూరించి ఈ నెల 15వ తేదీలోగా అందచేయాలని తెలిపారు.

# లోతేరు రోడ్డులో హెచ్చరిక బోర్డు లేక ప్రమాదాలు



అరకు: అరకులోయ మండలం లోతేరు రోడ్డు హెచ్చరిక బోర్డులేక తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండటంతో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. రోడ్డు గుత్తేదారులు హెచ్చరిక బోర్డులు పెట్టవలసి ఉన్న పట్టించుకోవడంలేదు. కొన్ని సార్లు అంబులేన్స్ బోల్తాపడి వైద్య సదుపాయాలకు ఇబ్బంది పడుతున్నారు. రహదారి త్వరితగా పూర్తి చేస్తే తప్ప ఇబ్బంది తప్పటంలేదని వాహనచోదకులు అంటున్నారు. ఇప్పటికైన ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు పెట్టి రోడ్డు త్వరగా పూర్తిచేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

# రాష్ట్ర సంపదను దోచుకుంటున్న తండ్రీకొడుకులు



## • రానున్న ఎన్నికల్లో తెదేపా గల్లంతే • మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం • జగన్‌తోనే బీసీలకు న్యాయం • వైకాపా నేత విజయసాయి రెడ్డి ధ్వజం

విశాఖపట్నం : రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, తనయుడు లోకేష్ దోచుకుంటున్నారని రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి, పార్లమెంటుసభ్యులు విజయసాయిరెడ్డి ద్వజమెత్తారు. అవినీతికి కేరాఫ్ చంద్రబాబు ప్రభుత్వమని వైసీపీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆరోపించారు. విజయసాయిరెడ్డి చేపట్టిన సంఘీభావ పాదయాత్ర శుక్రవారం ఉదయం పశ్చిమ నియోజక వర్గం పారిశ్రామిక ప్రాంతంలో ప్రారంభమైన 48,46,47 49,45, వార్డులో ప్రకాష్ నగర్, అంబేద్కర్ కానీ, టీడీపీ కానీ, గుడివాడ అప్పన్న కానీ, ఎఎస్ఆర్ నగర్, దుర్గానగర్, త్రినాధపురం, క్రాంతి నగర్, చింతలోవ, కాకరలోవ, ఏకెసి కోనీ, మల్కాపురం మీదుగా జింక్ గేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అవినీతి చేయడంలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపిందన్నారు. చంద్రబాబుతో సహా టీడీపీ మంత్రివర్గం, ప్రజాప్రతినిధు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ఆరోపించారు. అంతేగాక మహిళా సాధికారితే తమ ధ్యేయమని ఎన్నికకు ముందు ప్రకటించిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తరువాత వారికి రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫమయ్యారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్టంలో మహిళపై దాడులు అధికమయ్యాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అత్యాచారాల్లో దేశంలోనే మూడో స్థానంలో నిలిచిందని ఏడీఆర్ అనే స్వచ్ఛంద సంస్థ తన నివేదికలో వ్లెడిరచిందన్నారు. సాక్షాత్తు టీడీపీ మంత్రులుతో సహా, ఎమ్మెల్యేలు మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. మంత్రులు దేవినేని ఉమా, అచ్చెంనాయుడు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వంటి వారు మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించారన్నారు. సాక్ష్యాత్తు మంత్రులే మహిళపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే, సాధారన ప్రజల సంగతేంటని ప్రశ్నించారు. అదేవిధంగా బీసీకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని ఎన్నికకు ముందు చంద్రబాబు హామి ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని విస్మరించారని చెప్పారు. చంద్రబాబు బీసీ వ్యతిరేకి అని స్వయంగా మాజీ న్యాయమూర్తే బహిరంగంగా వ్యాఖ్యానించారని దీనిని బట్టి అర్థమవుతోందని అన్నారు. బీసీలంటే ' బాబు క్లాస్ ' అని ఆయన సామాజిక వర్గానికి మాత్రమే చంద్రబాబు న్యాయం చేస్తారని ఎద్దేవాచేశారు. బీసీల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న నాయకుడు జగన్ మాత్రమేనని స్పష్టంచేశారు. జగన్‌తోనే బీసీ అభ్యున్నతి సాధ్యపడుతుందన్నారు.

మూడవ రోజు శుక్రవారం విశాఖలో విజయ సాయిరెడ్డి చేపట్టిన సంఘీభావ దీక్ష పశ్చిమ నియోజక వర్గంలో ఉదయం ప్రారంభం అయినది . 48,4 6,47 49, 45, వార్డులలో ప్రకాష్ నగర్ , అంబేత్కర్ కోలనీ టిడిపి కోలనీ , గుడివాడ అప్పన్న కోలనీ , ఏ ఎస్ అర్ నగర్ , దుర్గానగర్, త్రీనాధ పురం , క్రాంతి నగర్ , చింతల లోవ , కాకర లోవ, ఏకెసి కోలనీ, ఏ ఎస్ సి కోలనీ, మల్కాపురం మీదుగా జింక్ గేట్ వరకు సాగిన యాత్ర భోజన విరామం తీసుకొని మరల సాయంత్రం కొనసాగిస్తారు. ఈ యాత్ర లో కాకినాడ మాజీ ఎమెల్యే కురసాల కన్నబాబు, గొల్ల బాబూరావు, మాజీ మంత్రి తమ్మినేని సీతారాం, నగర అద్యక్షులు మళ్ళా విజయప్రసాద్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి తైనాల విజయ కుమార్, గుడివాడ అమర్‌నాథ్, సత్తి రామ కృష్ణా రెడ్డి, సనపల చంద్ర మౌళి, పక్కి దివాకర్, రామన్న పాత్రుడు, బర్కత్ ఆలీ, వాసు గౌడ్, కొండా రాజీవ్ గాంధీ, మహిళా అధ్యక్షురాలు గరికిన గౌరి, శ్రీదేవి వర్మ తదితరులంతా పాల్గొన్నారు .



ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ సీనియర్ నాయకు తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఇది చాలా కీలకమైన సమయమని అన్నారు. నాలుగు సంవత్సరాలు గా టీడీపీ నాయలు , కార్యకర్తలు ఎలా వ్యవహరిస్తున్నారో అందరికీ తెలుసు నన్నారు. జన్మభూమి కమిటీల పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని దోచుకుతింటున్న టీడీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. బాబు దృష్టిలో బిసి అంటే బ్యాక్‌వర్డ్‌క్యాస్ట్ కాదని బాబు క్యాస్ట్అని అందుకే తమ వర్గానికే పెద్దపీట వేస్తూ రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబునాయుడు పాలనంతా అవినీతి మయమని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిన తెదేపా ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేసారు. నిత్యం ప్రజాసమస్యలపై వైకాపా పోరాటం చేస్తుందని, ఏపీకి ప్రత్యేకహెూదా వచ్చేవరకు పోరాటం ఆగదని అన్నారు. అందుకు ప్రజాసహాకారం కావాలని కోరారు.



సంఘీభావ పాదయాత్రలో భాగంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో మళ్ళా విజయ ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖా ముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మనమంతా వైకాపా కుటుంబ సభ్యులమన్నారు. ప్రతీ ఒక్కరూ బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## 'గాలి'కి సుప్రీంలో చుక్కెదురు

### జనార్దన్ రెడ్డి ప్రచారానికి వీల్లేదు : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: మైనింగ్ కింగ్, కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొనటానికి అనుమతించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. బళ్లారి నియోజకవర్గంలో జనార్దన్ సోదరుడు సోమశేఖర రెడ్డి బీజేపీ తరపున పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయన తరపున బళ్లారిలో ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు గాలి జనార్దన్ సిద్ధమయ్యాడు. ఈ మేరకు బెయిల్ నిబంధనలను సడలిస్తూ 10 రోజులు అనుమతి ఇవ్వాలని ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు దానిని తిరస్కరించింది. మైనింగ్ కేసులో గాలికి సుప్రీంకోర్టు షరతులతో కూడా బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. బళ్లారి ప్రాంతానికి వెళ్లకూడదన్న నిషేధాజ్ఞల నేపథ్యంలో ఆయన కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు మాత్రం అందుకు అనుమతించబోమని తేల్చి చెప్పింది.

## 6 నెలల్లో కొత్త విధానం

### జీఎస్టీ మండలి ఆమోదం

### అప్పటి వరకూ ప్రస్తుత విధానమే కొనసాగింపు

దిల్లీ: వస్తుసేవల పన్ను రిటర్న్‌ల దాఖలు సరళీకరణకు జీఎస్టీ మండలి ఆమోదం తెలిపింది. నెల నెలా ఒక పేజీతో కూడిన రిటర్న్‌లు సమర్పించే కొత్త విధానాన్ని ఆరు నెలల్లో అమలులోకి తీసుకు రావాలని తీర్మానించింది. అప్పటి వరకు ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని నిర్ణయించింది. జీఎస్టీ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయి ప్రభుత్వ సంస్థగా మార్చేందుకు అంగీకారం తెలిపింది. చక్కెరపై వస్తుసేవల పన్నుకు అదనంగా సుంకం విధించడంపై నిర్ణయాన్ని జీఎస్టీ మండలి వాయిదా వేసింది. ఆ అంశంపై తదుపరి సమావేశం నాటికి తగిన సిఫార్సులు చేసే బాధ్యతను ఐదు రాష్ట్రాల ఆర్థికమంత్రులతో కూడిన బృందానికి అప్పగించింది. డిజిటల్ చెల్లింపులు జరిపిన వారికి రెండు శాతం ప్రోత్సాహం అందించడంపై సూచనలు అందించాలని మరో ఐదు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల బృందాన్ని జీఎస్టీ మండలి కోరింది.

ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ... ప్రస్తుతం జీఎస్టీఎన్‌లో ప్రభుత్వానికి 49 శాతం, ఇతర సంస్థలకు 51 శాతం వాటా ఉంది.

ప్రైవేటు సంస్థల దగ్గరున్న 51 శాతం వాటాను ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది. జీఎస్టీఎన్‌లో ఇకపై కేంద్ర ప్రభుత్వం 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నీ కలిపి 50 శాతం వాటా కలిగి ఉంటాయి. జీఎస్టీ రిటర్న్‌ల దాఖలుకు ప్రత్యామ్నాయంపైనా చర్చ జరిగింది అని వివరించారు.

## భారత్‌పై ప్రపంచ బ్యాంకు ప్రశంసలు...

న్యూఢిల్లీ: గడువుకన్నా ముందే భారత్ సంపూర్ణ విద్యుత్ వినియోగ దేశంగా అవతరించనుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. 2030 కంటే ముందే దేశంలోని ప్రతి గ్రామంలోనూ విద్యుత్ వెలుగులు నిండనున్నాయని ప్రకటించింది. విద్యుదీకరణపై భారత్ అద్భుతంగా కృషి చేస్తోంది. ఇప్పటికే 85 శాతం మంది ప్రజలకు విద్యుత్ సదుపాయం అందుకుంటున్నారు... అని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి ఒకరు ఇవాళ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి ఒక్క గ్రామంలో విద్యుత్ సౌకర్యాన్ని కల్పిండమే లక్ష్యంగా భారత ప్రభుత్వం 2015లో దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం దేశంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామంటూ ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఆయన ఈ విషయం చెప్పిన కొద్ది రోజులకే ప్రపంచ బ్యాంకు ప్రశంసలు కురిపించడం విశేషం.












VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ĸ Phone : 2564353, Fax : 0891-2569004 ĸ e-mail: vijayabhanudaily@gmail.com

# చిత్రభాను

## నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా రివ్యూ



యువతలో మంచి క్రేజ్ ఉన్న కథానాయకుడు అల్లు అర్జున్. తన స్టైల్, డ్యాన్స్‌లతో వెండి తెరపై మెరుపులు మెరిపించేస్తారు. ఇక ఆయన నుంచి చిత్రం వస్తోందంటే ఏదో ఒక కొత్తదనం ఉంటుందని ఆశిస్తారు. గతేడాది 'దువ్వాడ జగన్నాథం'తో ఆకట్టుకున్న బన్ని ఈసారి ఓ విభిన్న కథాంశంతో 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన వక్కంతం వంశీ తొలిసారి మెగాఫోన్ పట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం విశేషం. అల్లు అర్జున్ గత చిత్రాలకు పూర్తిభిన్నంగా ఆర్మీ నేపథ్యంలో సాగే కథను ఎంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఫస్ట్ ఇంపాక్ట్ చూసిన ప్రతీ ప్రేక్షకుడు సినిమా పట్ల బన్ని అంకిత భావానికి ఫిదా అయిపోయారు. మరి బిగ్ స్క్రీన్‌పై ఇండియా కోసం సూర్య ఏం చేశాడు? రచయిత నుంచి దర్శకుడిగా మారిన వంశీ ఏ మేరకు ఆకట్టుకున్నారు?

ఆర్మీ ఆఫీసర్‌గా అల్లు అర్జున్ ఎలా ఉన్నారు?

కథేంటంటే: సూర్య(అల్లు అర్జున్) ఒక సైనికుడు. కోపం ఎక్కువ. చిన్న తప్పు జరిగినా ఓర్చుకోని మనస్తత్వం. హెడ్ క్వార్టర్స్ నుంచి బోర్డర్ వెళ్లాలన్నదే అతడి లక్ష్యం. ఇంతలో పై అధికారులకు తెలియకుండా ఒక ఉగ్రవాదిని కాల్చి చంపేస్తాడు. దీంతో సైనిక నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన సూర్యను ఆర్మీ నుంచి బయటకు పంపించాలని కల్నల్(బొమన్ ఇరానీ) నిర్ణయిస్తాడు. అయితే సూర్య గాడ్ ఫాదర్(రావురమేష్) విన్నపంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటాడు. అంతా బాగానే ఉందని వైజాగ్‌లో ఉన్న సైకియాట్రిస్ట్ రఘురామ కృష్ణంరాజు(అర్జున్) దగ్గర సంతకం తీసుకొస్తే బోర్డర్‌కు పంపుతానని కల్నల్ చెబుతాడు. రామకృష్ణంరాజు 21రోజుల సమయం ఇచ్చి, కోపం తగ్గించుకుని రమ్మని సూర్యకు చెబుతాడు. మరి ఆ ఛాలెంజ్‌లో సూర్య నెగ్గాడా? అతను బోర్డర్‌కి వెళ్లాడా? రఘురామ కృష్ణంరాజుకు సూర్యకు ఉన్న బంధం ఏంటి? అనేదే 'నా పేరు సూర్య'

ఎలా ఉందంటే: గమ్యం ఒకటే కాదు.. ప్రయాణం కూడా బాగుండాలని.. క్యారెక్టర్ కోసం కలను సైతం వదులుకున్న ఓ సైనికుడి కథ ఇది. అర్థవంతమైన కథా, కథనాలతో తెరకెక్కిన చిత్రం. దేశభక్తి ప్రధానంగా సాగుతుంది. సరిహద్దులోనే కాదు.. మనలోనూ మనకు శత్రువులు ఉన్నారని చెబుతుంది. మనం ఇండియాలో ఉండటం కాదు.. మనలో ఇండియా ఉందా? లేదా? అని ప్రశ్నించుకునేలా చేస్తుంది. సరిహద్దులకు వెళ్లి, దేశం కోసం నిలవడమే తన కల అనుకున్న ఓ సైనికుడిని చుట్టూ పరిస్థితులు ఎలా ప్రభావితం చేశాయన్నది ఆసక్తికరం. ఆ ఆర్మీ క్యాంపు నేపథ్యంలో కథ మొదలవుతుంది. అక్కడ కథానాయకుడి తీరును ఎలివేట్ చేసిన విధానం ఆ నేపథ్యంలో సాగే 20 నిమిషాల సన్నివేశాలు ఆసక్తికరంగా అనిపిస్తాయి. ప్రతి సన్నివేశం సహజత్వానికి అద్దం పడుతుంది. కథ ఆర్మీ క్యాంప్ నుంచి వైజాగ్‌కు మారాక, కథానాయకుడి పాత్ర తప్ప మిగతావన్నీ రొటీన్‌గానే అనిపిస్తాయి. వర్ష(అను ఇమ్మాన్యుయేల్)తో ప్రేమాయణం, సూర్య కుటుంబ నేపథ్యం, చల్లా(శరత్ కుమార్) గ్యాంగ్ చేసే అరాచకాలు ఇవన్నీ ఇది వరకే తెరపై చూసేసిన సగటు కమర్షియల్ సినిమాలను గుర్తుకు తెస్తాయి. అయితే సూర్య 21 రోజుల ఛాలెంజ్‌లో నెగ్గుతాడా? బోర్డర్‌కు వెళ్తాడా? అనే విషయాలు ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి.

ఎప్పుడూ బోర్డర్.. బోర్డర్.. అనే తపించే సూర్య అక్కడకు వెళ్లి యుద్ధం చేయకపోవడమే ప్రేక్షకుడికి కాస్త నిరుత్సాహం అనిపించినా, అతని క్యారెక్టర్‌పై





తీర్చిదిద్దిన సన్నివేశాలు, బోర్డర్‌లో చేయాల్సిన యుద్ధం ఇక్కడే చేస్తున్నాడంటూ పాత్రను మలిచిన విధానం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తుంది. ప్రథమార్థంతో పోలిస్తే, ద్వితీయార్థంలో సన్నివేశాలు ఊహకు అందేలా సాగినా, భావోద్వేగాలు మాత్రం ఆకట్టుకుంటాయి. దేశభక్తి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు చప్పట్లు కొట్టిస్తాయి. కథానాయకుడి క్యారెక్టరైజేషన్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

ఎవరెలా చేశారంటే: అల్లు అర్జున్ వన్ మెన్ షో. ఆయన పాత్ర కోసం తనని తాను తీర్చిదిద్దుకున్న విధానం ఆ పాత్ర కోసం పడిన కష్టం తెరపై అడుగడుగునా కనిపిస్తాయి. కోపం ఉన్న సైనికుడిగా ఆయన హావభావాలు చాలా బాగుంటాయి. ఈ సినిమాలోని ఆయన నటన కెరీర్‌లోనే హైలైట్‌గా నిలుస్తుంది. ఫైట్స్, డ్యాన్సుల్లోనూ తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు. వర్షగా అను ఇమ్మాన్యుయేల్ అందంగా కనిపించారు. అదే సమయంలో పరిధి మేరకు భావోద్వేగాలు కూడా పండించారు. చల్లాగా శరత్‌కుమార్ ఆకట్టుకుంటారు. కార్గిల్ పోరాటంలో కాలు కోల్పోయిన సైనికుడు ముస్తఫా(సాయికుమార్) పాత్ర కూడా బాగుంది. అర్జున్ నటన సినిమాకు ప్రధాన బలం. సూర్య గాడ్ ఫాదర్‌గా రావు రమేష్ చిన్న పాత్రలో మెరిపిస్తారు. మిగిలిన వాళ్లు తమ పరిధి మేరకు నటించారు. సినిమాలో 'లవర్ ఆల్సో ఫైటర్ ఆల్సో' 'దిల్లే ఇండియా' పాటలను తీర్చిదిద్దిన విధానం బాగుంది.

సాంకేతికంగా..: తొలిసారి దర్శకత్వం వహించినా.. వక్కంతం వంశీలో పరిణతి తెరపై ప్రతీ సన్నివేశంలోనూ కనిపిస్తుంది. కథకుడిగా, దర్శకుడిగా ఆయనకు మంచి మార్కులు పడతాయి. కెమెరామెన్ రాజీవ్ రవి ఆర్మీ నేపథ్యాన్ని చూపించిన విధానం కొత్తగా ఉంది. విశాల్-శేఖర్ సంగీతం ఈ సినిమాకు ఉన్న ప్రధాన ఆకర్షణల్లో ఒకటి. అటు పాటల పరంగానూ, ఇటు నేపథ్య సంగీతం పరంగానూ మంచి ప్రతిభ కనబరిచారు. రాజీవ్ ఆర్ట్ డైరెక్షన్ సినిమాకు కొత్త లుక్‌ను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

## 65కోట్ల పారితోషికం?



తమిళ అగ్ర కథానాయకుడు రజనీకాంత్ పేరుప్రఖ్యాతుల గురించి అందరికి తెలిసిందే. అభిమానులు ఆయన్ని వెండితెరవేల్పుగా కొలుస్తారు.ప్రపంచవ్యాప్తంగా రజనీకి అభిమానగణం ఉన్నారు. నిర్మాణ దశలోనే ఆయన సినిమాలు బిజినెస్‌ను పూర్తిచేసుకుంటాయి. రజనీకాంత్ నటిస్తున్న తాజా చిత్రం 2.ఓ హక్కులు రికార్డుస్థాయిలో అమ్ముడుపోయాయి. కాలా చిత్రానికి కూడా అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇదిలావుండగా కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ ఓ చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే.

రజనీకాంత్ కెరీర్‌లో 165వ చిత్రమిది. సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ చిత్రానికి రజనీకాంత్ దాదాపు 65కోట్ల పారితోషికం తీసుకోబోతున్నట్లు చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. భారతీయ సినీ పరిశ్రమలోనే ఇదొక రికార్డని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. జాకీచాన్ తర్వాత ఆసియాలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న హీరో రజనీ కావడం విశేషం.

## నా అభిమాన తార



## ప్రేమించి పెళ్లాడుతా..!త్రిష



## అతనితో కేవలం 15 నిమిషాలు మాట్లాడా!

లాస్‌ఏంజెల్స్: గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె అమెరికన్ సిరీస్ 'క్వాంటికో 3'తో పాటు మరో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా తన ప్రాజెక్ట్‌ల గురించి, ప్రముఖ హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో ప్రేమలో ఉన్నారని వస్తున్న వదంతుల గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

రెండేళ్ల క్రితం ప్రియాంక ప్రఖ్యాత ఎమ్మీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టామ్‌తో కలిసి అవార్డులను ప్రదానం చేశారు. ఆ సమయంలో టామ్.. ప్రియాంక చెయ్యి పట్టుకుని స్టేజ్‌పైకి రావడంతో వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారన్న వదంతులు మొదలయ్యాయి. ఓ ఆంగ్ల మీడియా పత్రిక ప్రియాంక, టామ్ గురించి రాస్తూ.. 'అవార్డ్స్ కార్యక్రమంలో టామ్ ప్రియాంక భుజంపై చెయ్యి వేసి ఆమెకు దగ్గరగా నిలబడ్డాడు. వారిద్దరూ బాగా పరిచయం ఉన్నవారిలా మాట్లాడుకున్నారు. ఒకానొక సమయంలో ప్రియాంక దుస్తులను టామ్ సరిచేశాడు.' అంటూ రాసుకొచ్చింది.

దీనిపై ప్రియాంక స్పందిస్తూ..'నేను టామ్‌తో కలిసి పది నిమిషాల పాటు అవార్డులు ప్రదానం చేశాను. తనతో నేను మాట్లాడింది కేవలం 15 నిమిషాలే. ఆయన నా దుస్తులు సరిచేయడంలో సాయపడ్డాడు. అంతకుమించి మా ఇద్దరి మధ్య ఏమీ లేదు' అని వెల్లడించారు.

ఇటీవల ప్రియాంక చేతికి నల్లపూసలు ఉండడం చూసి ఆమె రహస్యంగా పెళ్లి చేసుకున్నారని వార్తలు వెలువడ్డాయి. దీనిపై ఆమె ట్విటర్ ద్వారా స్పందిస్తూ.. 'నా పెళ్లి విషయం గురించి దాచను. అందరికీ చెప్పే చేసుకుంటాను. అవి నల్లపూసలు కావు. దిష్టి పూస' అని వెల్లడించారు. తన హాలీవుడ్ ప్రాజెక్ట్‌లు పూర్తయ్యాక ప్రియాంక భారత్ వస్తారు. త్వరలో ఆమె సల్మాన్‌కు జోడీగా 'భారత్' చిత్రంలో నటించనున్నారు.



# విజయభాను

## సంపాదకీయం

### సంస్కారవంతంగా ఉండాలి

రాజకీయ నాయకులు తమ ఆలోచనల్లో సమాజం కన్నా ముందుండాలె. సంకుచిత భావజాలానికి అతీతంగా ఎదగాలె. మాట్లాడే ముందు ఉచితానుచితాలు గ్రహించాలె. నాయకుడు పరిపాలకుడైతే ఈ బాధ్యత మరింతగా ఉంటుంది. కానీ త్రిపుర సుదీర్ఘ వామపక్షపాలనకు అంతం పలికి అధికారానికి వచ్చిన బీజేపీ నేత, ముఖ్యమంత్రి బిప్లబ్ దేబ్ వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగినట్టుగా లేవు. తాజాగా ఆయన తమ ప్రభుత్వంలో జోక్యం చేసుకుంటే గోళ్ళు పీకేస్తామంటూ హెచ్చరించిన తీరు వివాదాస్పదమైంది. మహిళల గురించి బిప్లబ్ దేబ్ చేసిన వ్యాఖ్య కూడా ఏ మాత్రం సంస్కారవంతంగా లేదు. మనం మహిళలను దేవతలైన లక్ష్మి, సరస్వతిలా చూస్తాం. ఐశ్వర్యారాయ్ భారతీయ మహిళకు ప్రతినిధి. ఆమె మిస్ వరల్డ్ అయింది, సరే. కానీ డయానా హెడెన్‌లో ఏమి అందం ఉందో అర్థం కాదు అంటూ కించపరిచారు. ఒక మహిళను ఈ విధంగా అవమానించడం దేబ్ చెప్పుకుంటున్న విలువల ప్రకారమే ఆమోదయోగ్యం కాదు. డయానా హెడెన్ మేని వర్ణం చామన ఛాయలో ఉండటం వల్ల ఆయన ఈ వ్యాఖ్యలు చేశారా అంటే, అది జాతి వివక్ష కోణంలో తప్పుపట్టవలసిందే. అల్ప సంఖ్యాకవర్గానికి చెందినందు వల్ల ఈ అభిప్రాయానికి వచ్చినా పొరపాటే. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న నాయకుడు స్త్రీని అందం ప్రాతిపదికగా అంచనా కట్టడం కూడా తప్పే. గతంలో కూడా కొందరు రాజకీయ నాయకులు మహిళల పట్ల, రాజకీయాల్లోని స్త్రీల పట్ల కించపరిచే వ్యాఖ్యలు చేశారు. అందాల పోటీల వెనుక విదేశీ సంస్థల వ్యాపార కోణం దాగి ఉందని ఆయన చెప్పడం వరకు బాగానే ఉన్నది. ఇతరు ఏకీభవించినా, విభేదించినా ఆయన అభిప్రాయాలు ఆయనకు ఉంటాయి. కానీ మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేయకూడదు. బిప్లబ్ దేబ్ వ్యాఖ్యలు గమనిస్తే ఆయనకు సమాజంపైన, సమకాలీన నీతి సూత్రాల పట్ల కనీస అవగాహన లేదని స్పష్టమవుతున్నది. ఇంటర్నెట్ లేకపోతే సంజయుడు ధృతరాష్ట్రుడికి యుద్ధ విశేషాలు ఎట్లా వివరించారని కూడా బిప్లబ్ దేబ్ అన్నారు. మహాభారత కాలంలోనే ఉపగ్రహాలు కూడా ఉన్నాయనేది ఆయన వాదన. శాస్త్రీయ ప్రాతిపదిక లేకుండా, ఆధునిక పరిజ్ఞానమంతా మన ప్రాచీనులే కనిపెట్టారని ఎవరైనా నమ్ముతే నమ్మవచ్చు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయపక్షానికి చెందిన వారు ఈ ఆలోచనా విధానాన్ని కలిగి ఉంటే పర్యవసనాలు ఎట్లా ఉంటాయనే ఆందోళన కలుగుతుంది. కొద్ది నెలల కిందటే కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని కొట్టిపారేశారు. పాఠశాలల్లో, కళాశాలల్లో బోధనాంశాలను మార్చివేస్తామని అన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని వీడితే, మన దేశం అభివృద్ధి చెందుతుందా పరతంత్రంలోకి జారి పోతుందా అనేది ఆలోచించాలె. ప్రాచీన భారత దేశం విజ్ఞాన రంగంలో ముందంజ వేసిందనేది వాస్తవం. గణితం, వైద్యం, ఖగోళం వంటి భిన్న విజ్ఞానశాస్త్రాల్లో భారతీయులు అసమాన కృషి సాగించారు. ఆర్యభట్ట, భాస్కర వంటి గొప్ప శాస్త్రవేత్తలు మనవారే. నలంద, తక్షశిల వంటి విద్యాకేంద్రాలకు విదేశీయులు వచ్చి అధ్యయనం చేసేవారు. మహాభారతం మనం గర్వించదగిన గొప్ప ఇతిహాసం, రామాయణం ఒక మహా కావ్యం. కానీ ఇప్పుడు అనేక రంగాలలో పాశ్చాత్యులు మనలను దాటివేశారనేది అంగీకరించక తప్పదు. ఇప్పుడు మనం చేయవలసింది మన దేశం ఎందుకు వెనుకబడిందో గుర్తించడం. మళ్ళా ఉన్నత స్థాయిని ఎట్లా అందుకోవాలనేది ఆలోచించాలె. అంతే కానీ అన్నీ మనమే కనిపెట్టామని గొప్పలు చెప్పుకోవడం వల్ల ఫలితం ఉండదు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన నాటి నుంచి, స్వల్ప కాలంలోనే బిప్లబ్ దేబ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఆయన మేధో స్థాయిని వెల్లడిస్తున్నాయి. మెకానికల్ ఇంజినీర్లు సివిల్ సర్వీసెస్‌కు వెళ్ళవద్దు. సమాజాన్ని నిర్మించాలంటే, సివిల్ ఇంజినీర్లకే ఆ పరిజ్ఞానం ఉంటుంది. పరిపాలనారంగంలో ఉన్న వారు సమాజాన్ని నిర్మించవలసి ఉంటుంది అని ఆయన పేర్కొనడం ఆయనకు ఇంజినీరింగ్ కోర్సులపై గల అవగాహనను వెల్లడిస్తున్నది. మెకానికల్ ఇంజినీర్లు రాకూడదని అనలేదని, సివిల్ ఇంజినీర్లకు పరిపాలనా అనుభవం ఉంటుంది కనుక వారు రావాలని అన్నానని తరువాత వివరించారు. దాదాపు 95 శాతం అక్షరాస్యత ఉన్న రాష్ట్రం త్రిపుర. ఇంతగా విద్యాభివృద్ధి చెందిన రాష్ట్రంలో దేబ్ మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. గత ఎన్నికలలో రెండు శాతం ఓట్లు మాత్రమే పొందిన బీజేపీ ఈసారి విజయదుందుభి మోగించడం విశేషం. దీర్ఘకాలం అధికారంలో ఉన్న వామపక్షంపై ప్రజలకు అసంతృప్తి నెలకొన్నది. కాంగ్రెస్ దీటైన ప్రతిపక్షంగా నిలువ లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చింది.

## మహిళా రక్షణలో

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**- దాచేపల్లి ఘటన అమానుషం - హోదాపై ఏ పార్టీకీ చిత్తశుద్ధి లేదు**

**పీసీసీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి**



విశాఖపట్నం : యూపీఏ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, దేశంలో ప్రతీనిత్యం ఏదో ఓ

చోట మహిళలపై అసాంఘిక శక్తులు దాడులు చేస్తున్నాయని మహిళా రక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పీసీసీ అధ్యక్షుడు రఘు వీరా రెడ్డి అన్నారు. శుక్రవారం విశాఖ పర్యటనలో భాగంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రఘువీరా రెడ్డి మాట్లాడుతూ అమాయకులైన చిన్నారులపై లైంగిక దాడులు చేయడం అన్యాయం అన్నారు. దాచేపల్లి సంఘటన తీవ్ర మనస్థాపానికి గురి చేసిందని, ఒక తెలుగుదేశం పార్టీ సభ్యత్వమున్న వ్యక్తి ఈ దారుణానికి ఒడిగట్టడం టీడీపీ ప్రభుత్వం మహిళలపై ఎంత చిత్తశుద్ధితో ఉందో తెలుస్తోందని అన్నారు. ప్రత్యేక హోదాపై నేడు గొంతులు చించుకుంటన్న పార్టీలు గత నాలుగు సంవత్సరాలనుంచి ఏం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. మొదటి నుంచి ప్రత్యేక హోదా కావాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినది కాగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, మాజీ మంత్రి వట్టి వసంత కుమార్, మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సీఎం వైఖరి వల్లే దాచేపల్లి ఘటన అని వైఎస్ జగన్ ధ్వజం

**బాలికపై అత్యాచారాన్ని తీవ్రంగా ఖండించిన ప్రతిపక్ష నేత**

**నిందితుల్ని సరిగ్గా శిక్షించనందువల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి**



మచిలీపట్నం : గుంటూరు జిల్లా దాచేపల్లిలో తొమ్మిదేళ్ల బాలికపై అత్యాచారం జరిగిన పాశవిక సంఘటనకు సీఎం చంద్రబాబునాయుడుదే బాధ్యత అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పసి బాలికపై జరిగిన ఘాతుకం పట్ల ఆయన తన దిగ్భ్రాంతిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఉన్న వైఎస్ జగన్ దాచేపల్లి ఆటవిక సంఘటనపై గురువారం ట్వీటర్‌సహా సోషల్ మీడియాలో తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత దారుణమన్నారు. ఇలాంటి ఘాతుకాలు జరగడానికి చంద్రబాబు వైఖరే కారణమని దుయ్యబట్టారు. దాచేపల్లిలో తొమ్మిదేళ్ల పసి బాలికపై 55 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేయడాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో ఇటీవలికాలంలో ఇలాంటి ఘోరమైన సంఘటనలు చోటు చేసుకోవడం బాగా పెరిగిపోయిందన్నారు. నిందితుల్ని సరిగ్గా శిక్షించనందువల్లే ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్న దుండగుల్లో ఎక్కువగా టీడీపీ నేతలు, ఆ పార్టీకి చెందినవారే ఉండటం వల్ల ఇలాంటి నేరాలు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయన్నారు. చంద్రబాబూ.. ఇలాంటి పరిస్థితికి మీరు కాదా కారణం? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

**టీడీపీ హయాంలో మహిళలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు అధికమయ్యాయి..**

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు జరుగుతున్న సంఘటనలు అధికమయ్యాయని జగన్ అన్నారు. ఈ సంఘటనలకు పాల్పడుతున్న వారిలో అత్యధికులు అధికార టీడీపీకి చెందినవారే కావడం, వారిని పట్టుకోకుండా స్వేచ్ఛగా వదలి వేయడం వల్ల దుండగులకు ఇంకా ధైర్యం పెరిగి విర్రవీగుతున్నారని ఆయన చెప్పారు. గత నెల రోజుల్లో ఒక్క గుంటూరు జిల్లాలోనే మహిళలపై అత్యాచారం జరిగిన సంఘటనలు చాలా చోటు చేసుకున్నాయని, అయినప్పటికీ నేరాలకు పాల్పడిన వారిమీద ఎలాంటి చర్యలూ తీసుకోలేదని దుయ్యబట్టారు. మహిళలపై పెరుగుతున్న నేరాలకు టీడీపీ నాయకత్వమే కారణమని జగన్ తప్పుపట్టారు.

# బీజేపీ మేనిఫెస్టోను విడుదల చేసిన యడ్యూరప్ప

బెంగళూరు: కర్ణాటక శాసన సభ ఎన్నికల మేనిఫెస్టోను శుక్రవారం బీజేపీ నేత, కర్ణాటక ముఖ్యమంత్రి అభ్యర్థి యడ్యూరప్ప విడుదల చేశారు. మేనిఫెస్టో వివరాలు... రైతులకు రూ. లక్ష రుణమాఫీ, మహిళలకు తక్కువ వడ్డీకి రుణాలు, దళిత విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, పేద మహిళలకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు.

## కవి సమయం

### ఊహల-పల్లకి

కల-కల-కల
కిల-కిల-కిల
కోకిలమ్మ కుహ; కుహ;లు చేశావె!
గల -గల -గల
గిల-గిల-గిల
గోదావరి నడకల్లా!
వోయిలు -వొలక బోసావె!
చల - చల- చల
చిల-చిల-చిల
వాన చినుకుల్లా!
వాలావే - నా ఒంటిపైనా!
...॥కల॥
జల-జల-జల
జిల-జిల-జిల
అంతర జాలం చూపించవే ఇకనైనా!
వేయనా!... తీయనా!
తియ్యినా!... వేయనా!
జమ చెయ్యినా!
నా ఆర్థిక లావాదేవీలు
నీ కుహ:రంలో
తేలనా!... ములగనా!
ములగనా!.. తేలనా!
తేలి - తేలి- ములగనా!
నీ నది నీటి మడుగులో
డల - డల - డల
డిల- డిల- డిల
డమరుకం మ్రోగించనా
నీ మదిలోనా! ...॥కల॥
బల - బల-బల
బిల-బిల-బిల
తిరిగానే - తిరిగానే నీ చుట్టూ బొంగరంలా!
ఓనాడు
పల - పల-పల
పిల- పిల- పిలా
నీ ఊహల- పల్లకిలో ఊగనా!
పిల్లన గ్రోవి మోగించనా! ఈనాడు ఇకపైనా! ...॥కల॥

...కవితా రచన
యల్:సిద్ధు
సెల్ నెం: 7702977293

## పంచాంగం

a **మేషం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కోవలసి వస్తుంది. ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఓర్పు, నేర్పు వ్యవహరించ వలసివస్తుంది. భాగ స్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. ప్రము ఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. b **వృషభం** :రావల సిన ధనం సకాలంలో అందుట వలన పొదుపు దిశగా మీ ఆలోచన లుంటాయి. వాతావరణంలో మార్పు వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. c **మిథునం** : కోర్టు వ్యవహారాలు, స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తాయి. బంధుమిత్రుల రాకపోకలు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుస్తుంది. వస్త్ర, బంగారం, వెండి, ఫ్యాన్సీ వ్యాపారులకు పురోభివృద్ధి. d **కర్కాటకం** : స్త్రీలకు వాహనం నడుపుతున్నప్పుడు ఏకాగ్రత అవసరం. సోదరీ సోదరుల మధ్య అవగాహన కుదురుతుంది. బంధువుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసివస్తుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. e **సింహం** : బంధువుల నుంచి ఒత్తిడి, మొహమాటాలు ఎదుర్కొంటారు. ఎదుటి వారిని అతిగా విశ్వసించటం మంచిది కాదని గమనించండి.. f **కన్య** : ని టు ఇంటర్వ్యూల్లో ఏకాగ్రత ముఖ్యం. ముఖ్యమైన వ్యవహారాల్లో ఎదుటివారిని సలహా అడగడం మంచిదని గమనించండి. మీ జీవిత భాగస్వామి సలహా పాటించి లబ్ధి పొందుతారు. g **తుల** : మీ సామర్థ్యానికి ఆశించినంత ప్రతిఫలం లభిస్తుంది. స్త్రీలు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొం టారు. h **వృశ్చికం** : స్త్రీలు విలువైన వస్తువులు చేజార్చుకునే ఆస్కారం ఉంది. ఇళ్ల స్థలాలు, పొలాల అమ్మకంలో పునరాలోచన మంచిది. ఏజెంట్లకు, బ్రోకర్లకు శ్రమాధిక్యత మినహా ఆర్థిక సంతృప్తిఉండదు. i **ధనుస్సు** : పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. బంధు మిత్రులతో సఖ్యత నెలకొంటుంది. సోదరీ, సోదరులతో ఏకీభవించలేకపోతారు. j **మకరం** :రాజకీయ నాయకులు సభలు, సమావేశాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. మీ సంతానం విద్య, ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. వృత్తి, వ్యాపార రంగాల వారికి సదవ కాశాలు లభిస్తాయి. k **కుంభం** : ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. వాతా ఎమవరణంలో మార్పు రైతులకు ఆందోళన కలిగిస్తుంది. వ్యవ సాయ, తోటల రంగాల వారికి వాతావరణం అనుకూలిస్తుంది. L **మీనం** :వ్యాపారాభి వృద్ధికి అహ ర్నిలు శ్రమిస్తారు. ఖర్చులు, చెల్లింపులలో ఏకాగ్రత వహించండి. అర్థాంతరంగా నిలిపి వేసిన పునఃప్రారంభమవుతాయి. ప్రముఖుల సహకారంతో మీ సమస్య పరిష్కారమవుతాయి.

# ఆపదలో ఆదుకునే నారసింహుడు

## సంకీర్తన




నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించడం కోసమే ఆవిర్భవించాడు కనుక, భక్తులను ఆదుకోవడంలోను .. అనుగ్రహించడంలోను ఆయన ఎంత మాత్రం ఆలస్యం చేయడని అంతా విశ్వసిస్తుంటారు. ఆ స్వామి కొలువైన ప్రాచీనమైన క్షేత్రాల్లో ప్రకాశం జిల్లా పరిధిలో గల 'సింగరాయ కొండ' ఒకటిగా కనిపిస్తూ వుంటుంది. ఈ క్షేత్రం మహిమాన్వితమైనదని చెప్పబడే ఎన్నో సంఘటనలు ఇక్కడ కథలు .. కథలుగా వినిపిస్తూ వుంటాయి.

పూర్వం ఈ స్వామిని అర్చించే పూజారి, పసివాడైన తన బిడ్డతో సహా ఆలయానికి వెళ్లి, స్వామివారికి నైవేద్యం సమర్పించి వెనుతిరిగాడట. తన బిడ్డను ఆలయంలో మరిచిపోయి వెళ్లిన ఆయనకి, చాలా సేపటి తరువాత ఆ విషయం గుర్తుకు వచ్చింది. తన మతిమరుపుకు తిట్టుకుంటూ, పరుగు పరుగున ఆలయం దగ్గరికి చేరుకున్నాడు. పిల్లవాడు ఆకలితో ఏడుస్తూ ఉంటాడని అనుకుంటూ, ఆతృతగా తలుపులు తెరిచాడు.

ఆలయంలో ఆడుకుంటోన్న పిల్లవాడిని చూసి ఆనందంతో పొంగిపోయాడు. పిల్లవాడిని అక్కున చేర్చుకుని "ఆకలి వేయలేదా?" అని అడిగితే, నరసింహస్వామి మూర్తిని చూపించి ఆయన తనకి అన్నం తినిపించాడని చెప్పాడట. స్వామి ఇక్కడ ప్రత్యక్షంగా ఉన్నాడని చెప్పడానికి ఇదొక నిదర్శనమని చెబుతుంటారు. ఇక్కడి నారసింహుడు మనసున్నవాడనీ .. మహిమగలవాడనీ .. ఆపదలో ఆదుకునే బంధువని విశ్వసిస్తుంటారు.

### దశావతార పూజా ఫలితం !



శ్రీమహావిష్ణువు అనేక అవతారాలను ధరిస్తూ వచ్చాడు. వాటిలో 'దశావతారాలు' అత్యంత విశిష్టతను సంతరించుకుని కనిపిస్తూ వుంటాయి. మత్స్యావతారం ... కూర్మావతారం ... వరాహావతారం ... నృసింహావతారం ... వామనావతారం ... పరశురామావతారం ... రామావతారం ... కృష్ణావతారం ... బుద్ధావతారం ... కల్కి అవతారం .. దశావతారాలుగా చెప్పబడుతున్నాయి. వీటిలో కల్కి అవతారాన్ని స్వామివారు ధరించనున్నట్టు పురాణాలు చెబుతున్నాయి. ఇక స్వామివారు ధరించిన ఏ అవతారాన్ని తీసుకున్నా లోక కల్యాణమే దాని వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తూ ఉంటుంది. దుష్ట శిక్షణ ... శిష్ట రక్షణ చేయడం కోసం ... ధర్మాన్ని పరిరక్షించడం కోసం ఆయా సందర్భాల్లో శ్రీమన్నారాయణుడు ఈ అవతారాలను ధరించడం జరిగింది. అందుకు ఆ స్వామికి కృతజ్ఞతలు తెలుపుతూ ... సదా ఆయన అనుగ్రహాన్ని ఆశిస్తూ 'దశావతార వ్రతం' చేయాలని ఆధ్యాత్మిక గ్రంధ్యాలు చెబుతున్నాయి.

భాద్రపద శుద్ధ దశమినాడు పూజా మందిరాన్ని అలంకరించుకుని ...

దశావతారాల చిత్రపటాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఉపవాస దీక్షను చేపట్టి .. అత్యంత భక్తి శ్రద్ధలతో దశావతారాలను పూజించవలసి వుంటుంది. ఈ విధంగా చేయడం వలన సమస్త పాపాలు నశించి, శ్రీమన్నారాయణుడి అనుగ్రహం కారణంగా సకలశుభాలు కలుగుతాయని చెప్పబడుతోంది.